
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

నంద్యాల
జిల్లా వార్తలు
3
శుక్రవారం 6 డిసెంబరు 2024

**ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక**
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపర్ పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

| | |
|---|---|
| కర్నూలు, డోన్, ఆత్మకూరు, కల్లూరు | - 99854 09260 |
| కర్నూలు, కోడుమూరు, నందికొట్కూరు | - 9985411379 |
| ఆదోని, ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు | - 9985171793 |
| నంద్యాల, పాణ్యం, ఆళ్ళగడ్డ, బనగానపల్లె | - 9985411377 |

# ముంచెత్తిన ఫెంగల్


మల్లేవేములలో నీట మునిగిన శనగ పంటను చూపిస్తున్న రైతులు

చాగలమర్రి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ జిల్లా రైతాంగాన్ని కుదిపేసింది. చేతికొచ్చిన పంట చేయి దాటిపోయింది. ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో వారం రోజుల నుంచి రైతులు అల్లాడిపోతున్నారు. జడివాన రైతులకు కష్టాన్ని.. నష్టాన్ని మిగిల్చింది. కోత కోసి కుప్పలెత్తిన పంటలు, రోడ్లపై ఆరబోసిన ధాన్యం, ఉల్లిగడ్డలు ఇలా అన్ని రకాల పంటలు తడిసిపోయాయి. కోత కోయని పొలాల్లో వరి నేలకొరిగింది. చాగలమర్రి మండలంలో గురువారం భారీ వర్షం కురిసింది. 30 మి.మీ వర్షపాతం నమోదైంది. రెండు రోజుల నుంచి ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షం రైతులను నట్టేట ముంచింది. మండలంలోని మల్లేవేముల, శెట్టివీడు, చింతలచెరువు, గొడిగనూరు, ముత్యాలపాడు, పెద్దబోధనం, పెద్దవంగలి, చిన్నవంగలి తదితర గ్రామాల్లో పంటలు దెబ్బతిన్నాయి. మల్లేవేముల గ్రామంలో శనగ, మినుము పంటలు నీట మునిగాయి. చింతలచెరువు, కొలుములపేట, మూడురాళ్లపల్లె గ్రామాల్లో 500 ఎకరాల్లో వేసిన కేపీ ఉల్లి పంట నల్లబారి కుళ్లిపోయింది. ధర లేక పొలాల్లో ఆరబెట్టుకున్న ఉల్లి, వరి ధాన్యం తడిసి దెబ్బతిన్నాయి. ఆరబెట్టిన వరి ధాన్యంపై పట్టలు కప్పినా ఫలితం లేకపోయిందని రైతులు విలపించారు. 2 వేల ఎకరాల్లో వరి, 500 ఎకరాల్లో మినుము, 1,000 ఎకరాల్లో శనగ, 500 ఎకరాల్లో జొన్న పంట నేలవాలిపోయింది. తుఫాన్ నష్టం నుంచి ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

- చాగలమర్రి మండలంలో 30 మి.మీ., వర్షపాతం
- నీట మునిగిన శనగ, మినుము పంటలు
- తడిసి దెబ్బతిన్న వరి, ఉల్లి, జొన్న పంటలు
- ప్రభుత్వమే ఆదుకోవాలంటున్న రైతులు

### కొంప ముంచిన తుఫాను



తుఫాను కొంప ముంచింది. కోతలు కోశాక తుఫాను వచ్చింది. కుప్పలుగా పోసిన ధాన్యం తడిసి మొలకెత్తింది. టార్పాలిన్ పట్టలు కప్పినా ప్రయోజనం లేదు.

- సంజీవ, రైతు,

### వరి ధాన్యం మొలకెత్తింది


వర్షాలకు తడిసిన వరి ధాన్యం మొలకెత్తింది. ఎనిమిది ఎకరాల్లో వరి పంటను సాగు చేశా. వరి ధాన్యం మొలకెత్తి తీవ్రంగా నష్టపోయాం. ప్రభుత్వం కొనుగోలు చేసి ఆదుకోవాలి.

నరసింహులు, రైతు, చిన్నకంబలూరు


చింతలచెరువులో పట్టలపై నిలిచిన వర్షపు నీటిని తొలగిస్తున్న రైతులు


మల్లేవేములలో దెబ్బతిన్న మినుము పంటను చూపిస్తున్న రైతు

## వరి రైతుకు వానపోటు


వర్షంలోనే వరి ధాన్యం బస్తాలను ట్రాక్టరులో లోడ్ చేస్తున్న దృశ్యం


రహదారి వెంట వరి ధాన్యం కుప్పలు

రుద్రవరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఫెంగల్ తుపాను వల్ల గురువారం రుద్రవరం మండలంలో భారీ వర్షం కురిసింది. పంట పొలాల్లో నిలువ చేసుకున్న ధాన్యం కుప్పలు తడిసి మొలకెత్తింది. వరి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి ఆదుకోవాలని రైతులు కోరారు. రుద్రవరం మండలంలో 6337 హెక్టార్లలో ఖరీఫ్ సీజనులో రైతులు వరి పంట సాగు చేశారు. 4472 హెక్టార్లలో ఇప్పటికే కోత కోశారు. మిగిలిన 1865 హెక్టార్లు నేల పాలైందని రైతులు అంటున్నారు. చేతికందిన వరి పంట మొలకెత్తడంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు వాపోతున్నారు. ముందే గిట్టుబాటు ధరలు లేవని, గత ఏడాది కంటే ఈ ఏడాది 75 కేజీల బస్తాపైన రూ.500 తగ్గాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.


చింతలచెరువులో తడిసిపోయిన ఉల్లిగడ్డలను చూపిస్తున్న రైతు

# ఎంతపని చేశావయ్యా..!


సమీర(ఫైల్)


సలీమా(ఫైల్)

- కుమార్తెను, భార్యను హతమార్చిన భర్త
- భార్య ఆరునెలల గర్భిణి
- మూడేళ్ల కుమార్తెను గొంతు నులిమి చంపిన తండ్రి
- అదుపులో తీసుకున్న నిందితుడు
- హొళగుంద మండలం హెబ్బటంలో దారుణం

5

పాలబుగ్గల చిన్నారి.. బుడి బుడి అడుగులతో.. కాళ్లకు పట్టీలతో ఇల్లంతా తిరుగుతున్న బంగారు తల్లి. ఆ చిట్టితల్లికి అమ్మే దైవం.. నాన్నే సర్వం.. రోజూ అమ్మ ఒళ్లో పడుకోవడం, నాన్నతో ఆడుకోవడమే పని. మరికొన్ని నెలల్లో తోడుగా తోబుట్టువు వస్తుందని అమ్మ చెప్పే మాటలతో ఎంత ఆనందపడిందో. ఎంచక్కా ఇద్దరూ ఆడుకోవచ్చని ఆశపడింది. మంచీ, చెడు తెలియని ఆ చిన్నారికి తెలియదు.. తండ్రే కాలయముడవుతాడని. అమ్మను చంపేసమయంలోనూ వచ్చీరాని మాటలతో 'మమ్మీ... డాడీ.. వద్దు..డాడీ' అంటూ ఏడ్చేసింది. భయంతో ఓ మూలన అలా ఏడుస్తూ ఉండిపోయింది. అయినా ఆ కర్క హృదయ తండ్రి మనసు ఏమాత్రం కరగలేదు. మళ్లీ ఆడబిడ్డ పుడుతుందన్న కోపంతో పాటు భార్యపై అనుమానం పెంచుకున్న ఓ వ్యక్తి నిండు గర్భిణిగా ఉన్న భార్యను అతి కిరాతకంగా హతమార్చాడు. ఆ ఘటన చూసి బిక్కుబిక్కు మంటున్న మూడేళ్ల కుమార్తెను సైతం లాక్కొచ్చి గొంతు నులిమి పసిబిడ్డను చంపేశాడు. ప్రతి ఒక్కరి కంట్లో నీళ్లు తెప్పించే ఈ అమానవీయ ఘటన హొళగుంద మండలం హెబ్బటం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది.

# ముచ్చటగా మూడోసారి..!

- సాగుతున్న సాగునీటి సంఘాల ఎన్నికలు
- 11న నోటిఫికేషన్ వచ్చే అవకాశం
- నిర్వహణకు అధికారులు సిద్ధం

కర్నూలు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రెండుసార్లు వాయిదా పడ్డ సాగునీటి సంఘాల ఎన్నికలకు మరో ముహూర్తం దాదాపు ఖరారైంది. సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ షెడ్యూలు ప్రకారమైతే గురువారం (5వ తేది) ప్రారంభం కావాల్సి ఉండేది. ఫెంగల్ తుఫాన్ కారణంగా రాష్ట్ర ప్రభుత్వం వాయిదా వేసింది. ఈ నెల 14న నుంచి ఎన్నికల నీటి సంఘాల ఎన్నికలు నిర్వహిస్తామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు గురువారం అమరావతిలో వెల్లడించారు. అయితే అధికారిక సమాచారం రాలేదని, ఎప్పుడు నోటిఫికేషన్ జారీ చేసినా ఎన్నికలు జరిపేందుకు ఇంజనీర్లు సిద్ధంగా ఉన్నారు. ఈ నెల 11న జిల్లా కలెక్టరు నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం ఉంది. 18న కర్నూలు జిల్లాలో 123 సాగునీటి సంఘాల పరిధిలో 1,214 ప్రాదేశిక నియోజకవర్గం (టీసీ) సభ్యులు, నంద్యాల జిల్లాలో 261 సాగునీటి సంఘాలకు 2,480 టీసీ సభ్యులను రైతులు ఎన్నుకుంటారు. అదే రోజు టీసీ సభ్యులు సమావేశమై సాగునీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. 17న డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు, 20న ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని ఇంజనీర్లు పేర్కొంటున్నారు. అయితే అధికారికంగా సమాచారం వెల్లడి కావాల్సి ఉంది. రాష్ట్ర విభజన తర్వాత 2015లో ఆనాటి టీడీపీ ప్రభుత్వం సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం 2020లో నీటి సంఘాలను రద్దు చేసింది. మళ్లీ టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో తొమ్మిదేళ్ల తరువాత ఈ ఎన్నికల నిర్వహణకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అక్టోబరు 21న జిల్లా కలెక్టర్ నోటిఫికేషన్ జారీ చేయగా అసెంబ్లీ సమావేశాల కారణంగా వాయిదా వేశారు. ఈ నెల 5 నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉంటే.. ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో వాయిదా పడ్డాయి. ఎట్టకేలకు మూడోసారి ముహూర్తం నిర్ణయించారు. కర్నూలు జిల్లాలో 123 సాగునీటి సంఘాలు, 10 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 2 ప్రాజెక్టు కమిటీలు, నంద్యాల జిల్లాలో 261 సాగునీటి సంఘాలు, 25 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 4 ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది.


జలమండలి ఆఫీసులో ఎన్నికల సామగ్రిని సరి చేస్తున్న ఎంఐ ఏఈఈ రియాజ్, సిబ్బంది

# రీ సర్వే అక్రమాలపై చెక్?



గత వైసీపీ పాలనలో అంతులేని భూ దురాక్రమణలు జరిగాయి. ఆ పార్టీ నేతలు, గల్లీ నాయకులు ఎక్కడబడితే అక్కడ భూములు కబ్జా చేశారు. చివరికి 22ఏ పరిధిలోని ప్రభుత్వ భూములను రెవెన్యూ యంత్రాంగం సహకారంతో డీనోటిఫై చేసి అసైన్డ్ భూములుగా మార్చి వాటిని తమ పేర్లపై రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ అక్రమాలన్నీ గుర్తించింది. రీసర్వే పేరుతో జరిగిన అక్రమాలను చక్కదిద్ది, వీటికి పాల్పడిన నాయకులపై, సహకరించిన రెవెన్యూ యంత్రాంగంపైన క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. ఇందులో భాగంగానే ఈ నెల 6వ తేదీ జనవరి 8వ తేదీ వరకు అధికారులు గ్రామ గ్రామాన రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నారు.

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):

గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులు అధికారాన్ని అడ్డం పెట్టుకుని గ్రామాల్లో పెద్ద ఎత్తున భూకబ్జాలకు పాల్పడ్డారు. దశాబ్దాల కింద ప్రభుత్వం ఇచ్చిన భూముల్లో వ్యవసాయం చేసుకుంటున్న చిన్న, సన్నకారు రైతులను భయపెట్టి అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వీరి భూదాహం ఇంతటితో ఆగలేదు. 22ఏ సెక్షన్ కింద ఉన్న ప్రభుత్వ భూములను ఫ్రీహోల్డ్‌గా మార్చి తమ మాట వినే అమాయక రైతుల పేరు మీద అసైన్డ్ భూములుగా మార్చి, ఆ తర్వాత వాటిని తమ పేర్లతో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన రీసర్వేలో మూడు విడతల్లో కలిపి 593 గ్రామాల్లో రీసర్వే కార్యక్రమాన్ని పూర్తి చేశారు. అయితే.. పూర్తి స్థాయిలో కర్నూలు జిల్లాలో 141, నంద్యాల జిల్లాలో 148 గ్రామాల్లో మాత్రమే సర్వే పూర్తయింది. ఈ సందర్భంగా రెవెన్యూ యంత్రాంగాన్ని లోబర్చుకుని ఆనాటి ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన నేతలు, వారి అనుచరులు పెద్ద ఎత్తున ప్రభుత్వ భూములను తమ పేర్లతో రిజిస్ట్రేషన్లు కూడా చేయించుకున్నారు. నంద్యాల, కర్నూలు జిల్లాలో దాదాపు 20వేల ఎకరాలకు పైగానే అసైన్డ్ భూములను తమ పేరుతో రిజిస్ట్రేషన్లు చేసుకున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. రైతులను బెదిరించి తక్కువ మొత్తాన్ని వారికి ముట్టజెప్పి విలువైన అసైన్డ్ పొలాలను ఆ నాయకులు దక్కించుకున్నారు. ఇంతటితో వారి భూదాహానికి తెరపడలేదు. ప్రభుత్వ భూములను గుర్తించి వాటిని తమ బినామీలకు కట్టబెట్టి ఆ భూములను కూడా సొంతం చేసుకున్న దారుణాలు ఎన్నెన్నో వెలుగు చూశాయి. ఈ అన్యాయాలపై దరఖాస్తులు పెద్ద ఎత్తున రావడంతో ప్రాథమిక విచారణ చేయించారు. తమ దారుణాలు ఎక్కడ బయటకు వస్తాయోనని చిత్తూరు జిల్లా మదనపల్లిలో 22ఏ ఫైళ్లను వైసీపీ నేతలు తగులబెట్టడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. రీ సర్వే వల్ల రైతులకు జరిగిన అన్యాయాలను సరిదిద్దేందుకు ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ నెల 6 నుంచి జనవరి 8వ తేదీ వరకు గ్రామ గ్రామాన రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నారు. ఈ సదస్సుల్లో రైతులు ఇచ్చే దరఖాస్తుల వల్ల తమ భాగోతాలు ఎక్కడ బయట పడుతాయోనని నాయకులు కంటి మీద కునుకు లేకుండా ఉన్నారు. అలాగే రెవెన్యూ అధికారులు, వారి సిబ్బంది కూడా తమపై క్రిమినల్ కేసులు ఎక్కడ నమోదవుతాయోనని ఆందోళన చెందుతున్నారు

- భూ సమస్యలు పరిష్కారమవుతాయని ఆశిస్తున్న రైతులు
- అక్రమాలకు అండగా ఉన్న రెవెన్యూ యంత్రాంగంపై కేసులు నమోదవుతాయా..?
- 22ఏ, ఫ్రీహోల్డ్ భూఆక్రమణలపై ఫిర్యాదుల స్వీకరణ
- నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

మిగతా 4లో..

## 7న తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం

### కలెక్టర్ రాజకుమారి



నంద్యాల కల్చరల్, డిసెంబరు 05 (ఆంధ్రజ్యోతి): ఈనెల 7వతేదీ జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పెద్ద ఎత్తున పండుగ వాతావరణంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల భారీ సమావేశం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాజకుమారి గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఈ సమావేశానికి ప్రతి ఒక్కరినీ ఆహ్వానిస్తున్నామని, ప్రజాప్రతినిధులు, పూర్వ విద్యార్థులు, పురప్రముఖులు, గ్రామప్రజలు, తల్లితండ్రులు విజయవంతం చేయాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 995 ప్రాథమిక పాఠశాలలు, 110 ప్రాథమికోన్నత పాఠశాలలు, 294 ఉన్నత పాఠశాలల్లో ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

## 8 మంది కానిస్టేబుళ్లకు పదోన్నతి

కర్నూలు క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో 8 మంది కానిస్టేబుళ్లకు పదో న్నతి కల్పిస్తూ జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్ ఆదే శాలు జారీ చేశారు. పదోన్నతి పొందిన వారిలో ఇస్వి పోలీస్ స్టేషన్‌కు చెందిన కె. నీలకంఠ, నంద్యాల తా లుకా యుపీఎస్‌కు చెందిన కే.నాగేంద్ర, మహా నంది పోలీస్‌స్టేషన్‌కు చెందిన కే. రహీం ద్రు డు, ఉయ్యాలవాడ పోలీస్‌స్టేషన్‌కు చెందిన సి. శ్రీని వాసులు, దొర్నిపాడు పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ జి.సుధాకర్ రెడ్డి, మంత్రాలయం పోలీస్‌స్టేషన్‌లో ప ని చేస్తున్న కానిస్టేబుల్ కే. శ్రీనివాసులు, కర్నూ లు తాలుకా యూపీఎస్ కానిస్టేబుల్ ఎస్.మ హ్మ ద్ అలీ, నంద్యాల త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో పని చేస్తు న్న కానిస్టేబుల్ డి.సంజీవరాయుడు ఉన్నారు.

సాహిత్యం

# అలుపెరుగని అక్షర యోధురాలు



కర్నూలు కల్చరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆమె తండ్రి, పెద్ద తండ్రులు స్వాతంత్ర్య సమరయోధులు...దేశభక్తి వారు పట్టిన ఉగ్గుపాలతో ఒంటి నిండా చేరిపోయింది. భర్త నుంచి వంటబట్టిన భాగవతాది పురాణాలు, పౌరాణిక విషయజ్ఞానం మనస్సు నిండా ఉండిపోయాయి. బాగా చదువుకోవాలన్న ఆశను ఆనాటి కుటుంబ వ్యవస్థ అకుంఠం దశలోనే తుంచేసింది. పైగా 'ఆడవాళ్లు చదువుకొని ఉద్యోగాలు చేసేది ఉందా.. రాజ్యాలు ఏలేది ఉందా..?' అన్న ఒక్కమాటతో 8వ తరగతి వరకే చదువుకు స్వస్తి చెప్పాల్సి వచ్చింది. తర్వాత పెళ్లి, ఆ తర్వాత పిల్లలు, వారిని పెంచడం, బాగా చదివించి ప్రయోజకులను చేయడంతో ఆమె సగం జీవితం గడిచిపోయింది. ఆమె వెనక్కి తిరిగి చూసుకునే సరికి సగ జీవిత కాలం గడిచిపోయింది. అయినా ఆమెలో ఏదో పట్టుదల. ఏదో సాధించాలన్న తాపత్రయం. అన్నింటికీ మించి తెలుగు సాహిత్యంలో తనకంటూ ఒక గుర్తింపు రావాలన్న కాంక్ష. తన రచనల ద్వారా సమాజానికి ఏదైనా మంచి చేద్దామన్న కోరిక. ఇదే ఆమెను 88 ఏళ్ల వయస్సులో తెలుగు ఛందస్సు పాఠాలు నేర్చుకునేలా చేసింది. ఆపైన ఆమె తిరిగి వెనక్కి చూసుకోకుండా అక్షర ప్రస్థానం ప్రారంభించారు. ఇప్పటి వరకు 35 పుస్తకాలు వెలువరించారు. 90 ఏళ్ల వయస్సులో అలుపెరుగని అక్షర యోధురాలిగా అనునిత్యం రచన చేస్తూనే ఉన్నారు. ఆమెనే కర్నూలుకు చెందిన ఆరేపల్లి వరలక్ష్మమ్మ. తెలుగు భాష, తెలుగు పద్యం సామాన్య ప్రజలకు దూరమై పోతున్న తరుణంలో ఆమె తన పుస్తకాల ద్వారా మాతృభాషా విశిష్టతను తెలియజేస్తూ భావితరానికి తన పుస్తకాలతో మార్గదర్శనం చేస్తున్నారు.



- తొమ్మిది పదుల వయస్సులోనూ సాగుతున్న సాహితీ ప్రస్థానం
- ఇప్పటి వరకు 35 పుస్తకాలు వెలువరించిన ఆరేపల్లి వరలక్ష్మమ్మ

### మలిదశలో పుస్తక రచనలపై ఆసక్తి...

విశ్రాంత జీవితంలో, మలిజీవిత మజిలీ సాగిస్తున్న ఆరేపల్లి వరలక్ష్మమ్మకు 83 ఏళ్ల వయస్సులో హైదరాబాదులో ప్రజ్ఞా భారతి సంస్థ నిర్వహిస్తున్న ఒక సమావేశానికి వెళ్లింది. అక్కడ భమిడిపాటి సుబ్రహ్మణ్యంశర్మ రాసిన 'పల్స్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆ పుస్తకం ప్రముఖుల కొటేషన్లతో కూడిన వ్యాఖ్యలతో ఉన్నది. అయితే తాను ఎందుకు అలాంటి ప్రయత్నం చేయకూడదనే ఆలోచనతో 83వ ఏట 'ఆణిముత్యాలు' పేరుతో వేమన, బద్దెన, భర్తృహరి పద్యాలు, సుభాషితాలకు అచ్చ తెలుగులో అర్థాలు వివరిస్తూ పుస్తకాన్ని వెలువరించారు. దీనికి అనూహ్య స్పందన లభించింది. తర్వాత మరో రెండు పద్య పుస్తకాలు రాసి భాషా పండితులకు చూపించారు. ఆ పద్యాల్లో ఛందస్సు లేదని, ముందు ఛందస్సు నేర్చుకుంటే మంచి పద్యాలు రాసేందుకు అవకాశం ఉంటుందని వారు సూచించారు. దీంతో ఆమె ఒక తెలుగు మాస్టారు వద్దకు 84 ఏళ్ల వయస్సులో బడికి వెళ్లే ఒకటో తరగతి పిల్లల్లా పుస్తకాల సంచి భుజాన వేసుకొని వెళ్లి ఛందస్సు నేర్చుకున్నారు. అంతే ఆ తర్వాత ఆమె తిరిగి వెనక్కి చూసుకోలేదు.



### బాల్యం.. జీవిత నేపథ్యం

జిల్లాలోని కోడుమూరు మండలం, పులకుర్తి గ్రామానికి చెందిన చిన్నలక్కారెడ్డి, కామాక్షమ్మ దంపతులకు 1935 ఏప్రిల్ 25న వరలక్ష్మమ్మ జన్మించారు. ముగ్గురు అన్నదమ్ముల ఉమ్మడి కుటుంబంలో పెద్దతండ్రి పెద్ద లక్కారెడ్డి నాటి స్వాతంత్ర్య పోరాటంలో అరెస్టు అయ్యారు. ఆయన జైలుకు పోగా ఇద్దరు అన్నదమ్ములు చిన్న లక్కారెడ్డి, చిన్న రామిరెడ్డి వ్యవసాయం, ఇంటి పనులు చూసుకుంటూ అన్నకు కొరియర్‌గా స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వాములుగా ఉండేవారు. ముగ్గురు అన్నదమ్ములు వినోబాభావే ఇచ్చిన పిలుపు మేరకు భూదాన యజ్ఞానికి తమ పది ఎకరాల భూమిని కూడా ఇచ్చేశారు. అలా తండ్రి, పెద్ద తండ్రి నుంచి ఆమె తన బాల్యంలోనే దేశభక్తి స్ఫూర్తిని పొందారు. స్వాతంత్ర్యానంతరం మేనత్త కుమారుడు ఆరేపల్లి అనంతారెడ్డితో 1948 ఫిబ్రవరి 27న తన 13 మూడేళ్ల వయస్సులోనే పెద్దలు వివాహం చేశారు. అప్పటికే వరలక్ష్మమ్మ తమ స్వగ్రామంలో ఆరు వరకు, కర్నూలు న్యాయస్థానంలో పీపీగా విధులు నిర్వహిస్తున్న పెద్దనాన్న వద్ద 8వతరగతి వరకు చదువుకున్నారు. భర్త నుంచి రామాయణ, మహాభారత, భాగవతాది గ్రంథాల సారాంశాన్ని ఆమె నేర్చుకున్నారు. బాగా చదువుకోవాలన్న తపనను తన పిల్లల ద్వారా తీర్చుకున్నారు. ముగ్గురు ఆడపిల్లల్లో ఒకరిని వైద్యురాలిగా, మరొకరిని న్యాయవాదిగా, ఇంకొకరిని ఇంజనీర్‌గా చదివించి వివాహాలు జరిపించారు. ఒక అబ్బాయిని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా చదివించి వివాహం జరిపించారు. తన జీవితాన్ని నడిపించిన మార్గదర్శకుడు, తన భర్త 2007 ఫిబ్రవరి 26న ఆకస్మికంగా కన్నుమూశారు. ఆయన లేని బాధ నుంచి బయట పడేందుకు తిరిగి భారత, భాగవతాది పుస్తకాలు ఆశ్రయించారు. అందులోని పద్యాలకు పూర్తిగా అర్థాలు తెలుసుకున్నారు. ఈ విషయ పరిజ్ఞానం సామాన్య ప్రజలకు చేరువ చేయాలనే ఆసక్తి ఆమెలో పెరిగింది.

### ధార్మిక భావనలు వెల్లివిరిసేలా రచనలు...

ప్రస్తుత తరానికి ఉపయుక్తంగా నిలిచేలా, ధార్మిక భావనలు వెల్లివిరిసేలా ఆమె అనేక పుస్తకాలు రాసి వెలువరించారు. ఛందస్సు నేర్చుకున్నాక రెండో రచనగా శ్రీ హనుమద్విలాసామృతం రాశారు. ఇది పండితుల చేత కూడా ప్రశంసలు అందుకుంది. ఆ తర్వాత కుమార విజయం, సౌందర్య లహరి, సమర్థసాయి లలితా కథావలి, రమణీయ కల్యాణాలు, పుష్కర తిలకం, నీతిపథంలతోపాటు భారత, భాగవత గ్రంథాల్లోని అనేక ఉప కథలను సంకలనాలుగా తీసుకువచ్చారు. ఇప్పటి వరకు 35 పుస్తకాలు వెలువరించారు.

### శక్తి ఉన్నంత కాలం రాస్తూనే ఉంటా...



భగవంతుడు నాకు కళ్లు, ఆలోచనా శక్తి ఇచ్చింతకాలం రాస్తూనే ఉంటాను. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాల్లో పెద్దలు పిల్లలకు రామాయణ, మహాభారత, భాగవతాది కథలను చెప్పి వారిలో వివేచన కలిగించేవారు. నేడు ఆ పరిస్థితి లేదు. పిల్లలకు కథలు చెప్పే సమయం తల్లిదండ్రులకు లేదు. అందుకే మంచి నీతివంత కథలు, తెలుగు భాషను సుసంపన్నం చేసే పద్యాలతో భావి తరానికి ఉపయోగపడేలా రచనలు చేస్తున్నాను. ఒకనాడు వ్యవసాయం చేయడంలో సంతోషం ఉండేది. తర్వాత పెళ్లి, సంసారం, పిల్లల చదువు వంటి వాటిలో సంతోషంగా గడిపాను. ఇప్పుడు ఈ రచనల ద్వారా సంతోషంగా నా మలి జీవితం సాగిపోతోంది. ఇంతకన్నా నాకు కావాల్సింది ఏమీ లేదు. - ఆరేపల్లి వరలక్ష్మమ్మ

# రీ సర్వే అక్రమాలపై చెక్?



(3వ పేజీ తరువాయి)

### తహసీల్దార్ల కార్యాలయాల వద్ద రైతుల పడిగాపులు

గత వైసీపీ ప్రభుత్వం రీసర్వే పేరుతో దశాబ్దాల కాలంగా రైతులు అనుభవిస్తున్న పొలాల హద్దులను సరి చేస్తామని గొప్పలు చెప్పి.. చివరకు వారిని నానా తిప్పలు పెట్టింది. కర్నూలు జిల్లాలో 141, నంద్యాల జిల్లాలో 148 గ్రామాల్లో సర్వే పూర్తి చేశారు. అయితే ఈ సర్వే తప్పుల తడకగా మారడంతో అన్నదాతలు తమ బంధువులు, చుట్టుపక్కల నివసించే రైతులతో రోజు ఘర్షణ పడాల్సిన పరిస్థితి నెలకొంది. మొదటి విడతలో 35వేలు, రెండో విడతలో 16,050, మూడు విడతల్లో 160 గ్రామాల్లో రీసర్వే పూర్తయిందని రెవెన్యూ అధికారులు చెబుతున్నా ఇంకా అనేక గ్రామాల రైతులకు హక్కు పత్రాలు అందలేదు. చాలా మంది రైతులు రీసర్వే కారణంగా తమ పొలాలు తమకు కాకుండా పోయాయని ఆందోళన చెందుతున్నారు. ఈ తప్పులను సరిదిద్దాలని రెవెన్యూ కార్యాలయాల వద్ద రేయింబవళ్లు పడిగాపులు కాస్తున్నారు.

### 22ఏ ఆక్రమణలు వెలుగు చూసేనా..?

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 914 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో 22ఏ పరిధిలో దాదాపు లక్ష ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయి. ప్రభుత్వంలో కీలక నాయకులు, వారి అనుచరులు ఈ భూములను ఫ్రీహోల్డ్ చేయించి అసైన్డ్ భూములుగా మార్చేసి ఆ భూములను బినామీల పేరుతో రెవెన్యూ అధికారుల చేత పత్రాలను సృష్టించుకున్నారు. వైసీపీ ప్రభుత్వం అసైన్డ్ భూములను రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని ఉత్తర్వులు జారీ చేసిన వెంటనే వీరంతా ఆ భూములను తమ బంధువులు, స్నేహితుల పేరుతో రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. ఇట్లా ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 20వేల ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు నాటి వైసీపీ పెద్దలు, వారి అనుచరుల పరమైపోయాయి.

### అక్రమాలు బయటపడేనా..?

రీసర్వేలో తప్పుడు వివరాల కారణంగా రైతులు ఎదుర్కొంటున్న నరకయాతనతో పాటు 22ఏ పరిధిలోని భూములను ఏ విధంగా తమ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారో నిగ్గు తేల్చేందుకు రెవెన్యూ సదస్సులు కీలకం కానున్నాయి. రెవెన్యూ అధికారులు ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గకుండా రైతులకు న్యాయం చేసేందుకు చర్యలు తీసుకునేలా వారికి స్వేచ్ఛ ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. దీంతో రైతులు ఈ రెవెన్యూ సదస్సులు తమకు న్యాయం జరుగుతుందనే ఆశతో ఉన్నారు.

### ఒత్తిళ్లకు గురికాకుండా రెవెన్యూ సదస్సులు నిర్వహించాలి

నేటి నుంచి ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను అధికారులు ఎవరి ఒత్తిళ్లకు గురి కాకుండా నిర్వహిస్తేనే రైతులకు న్యాయం జరుగుతుంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతులు నరకయాతన అనుభవించారు. ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు అక్రమదారుల పరమైపోయాయి. భూకబ్జాదారుల భరతం పట్టేందుకు రెవెన్యూ సదస్సులే కీలకం కానున్నాయి.
- రామకృష్ణ, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

### వృత్తి విద్యా కోర్సులతో భవిష్యత్తు : జీసీడీవో స్నేహలత

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వృత్తి విద్యా కోర్సుల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని జిల్లా గర్ల్స్ చైల్డ్ డెవలెప్ మెంట్ ఆఫీసర్ (జీసీడీవో) స్నేహలత పేర్కొన్నారు. గురువారం కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వృత్తి విద్యా కోర్సులను జీసీడీవోతో పాటు జిల్లా కో ఆర్డినేటర్లు విక్రమ్, ప్రతాప్ పరిశీలించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు డీఎస్ హుశేన్‌తో మాట్లాడారు. విద్యార్థుల్లో నైపుణ్యం పెంచడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. వృత్తి విద్యా అధ్యాపకులు మధుసూదన్, కృష్ణకుమారి తదితరులు ఉన్నారు.

## నేలసారం పోకుండా చర్యలు తీసుకోవాలి



యాగంటిపల్లె కృషి విజ్ఞానకేంద్రంలో నేల దినోత్సవంలో మాట్లాడుతున్న కెవికె శాస్త్రవేత్త

బనగానపల్లె, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నేలసారం పోకుండా చర్యలు తీసుకోవాలని యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ ధనలక్ష్మి రైతులకు సూచించారు. గురువారం బనగానపల్లె మండలంలోని యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రంలో నేలల దినోత్సవాన్ని రైతుల సమక్షంలో నిర్వహించారు. ధనలక్ష్మి మాట్లాడుతూ నేలల సంరక్షణకై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పర్యవేక్షణ, పరిరక్షణపై రైతులు అవగాహన పెంచుకోవాలని అన్నారు. ప్రపంచంలో 30 శాతం నేలలు సారం కోల్పోయాయన్నారు. రసాయనిక ఎరువులకు స్వస్తి చెప్పి, పరిమితి మేరకు ఎరువులు వాడాలని రైతులకు సూచించారు. 2-3 సీఎం నేల ఆరోగ్యంగా తయారవడానికి 1000 సంవత్సరాలు పడుతుందన్నారు. నేల విలువ తెలుసుకొని భావిభారత పౌరులకు ఆరోగ్యవంతమైన నేల అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు రమణయ్య, సుధాకర్, బాలరాజు, కృష్ణమూర్తి, ఆదినారాయణ, రవిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### రక్తపరీక్షలు చేయాలి

రుద్రవరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు ఉమ్మడి జిల్లాల మలేరియా నివారణ రీజనల్ డైరెక్టరు త్యాగరాజు రుద్రవరం మండలం నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన తదితరులు పాల్గొన్నారు.

### 8న అండర్-12 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా అండర్-12 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక 8 ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్వర్యంలో ఉంటుందని అసోసియేషన్ కార్యదర్శి కే. దేవేంద్రగౌడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఎస్ఏ స్టేడియంలో ఉదయం 10 గంటలకు అసోసియేషన్ సిమేషన్ నెట్స్‌లో జరిగే ఎంపికలో ఆసక్తి ఉన్న క్రీడాకారులు పాల్గొనాలని ఆయన సూచించారు. 1.9.2012 తరువాత 31.8.2014కు ముందు జన్మించిన వారు మాత్రమే అర్హులన్నారు. వివరాలకు 9959251047లో సంప్రదించాలన్నారు.

## జనవరి 1 నుంచి నాటకోత్సవాలు



మాట్లాడుతున్న పత్తి ఓబులయ్య

కర్నూలు కల్చరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో జనవరి 1 నుంచి 3 వరకు రాష్ట్రస్థాయి సాంఘిక నాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. గురువారం కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన నాటకోత్సవాల వివరాలు వెల్లడించారు. హైదరాబాదులోని మహతి క్రియేషన్స్ సంస్థ, టీజీవీ కళాక్షేత్రం సంయుక్త నిర్వహణలో, సీనియర్ సినీ, టీవీ నటుడు సుబ్బరాయశర్మ సారథ్యంలో ఈ నాటకోత్సవాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. జనవరి 1న హైదరాబాదులోని గువ్వాడ క్రియేషన్స్ సంస్థ వారి 'మూల్యం', గుంటూరు జిల్లా కొలకలూరు సాయి ఆర్ట్స్ సంస్థ వారి 'జనరల్ బోగీలు' నాటికల ప్రదర్శన ఉంటాయని తెలిపారు. జనవరి 2న మొదటి నాటికగా గుంటూరులోని అమరావతి ఆర్ట్స్ సంస్థ వారి 'చిగురు మేఘం', రెండో నాటికగా హైదరాబాదులోని డీఆర్కే ఫైన్ ఆర్ట్స్ సంస్థ వారు 'ఈ మంచం నాది కాదు' నాటిక ప్రదర్శిస్తారని తెలిపారు. జనవరి 3న హైదరాబాదు మహతి క్రియేషన్స్ సంస్థ వారి 'ఉక్కు సంకెళ్లు' నాటిక సీనియర్ నటుడు సుబ్బరాయ శర్మ దర్శకత్వంలో ప్రదర్శిస్తారని తెలిపారు. ప్రతిరోజూ ప్రముఖ కళాకారులకు సత్కారం ఉంటుందని వివరించారు. ఈ సమావేశంలో కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్ మియా, సభ్యులు సంగా ఆంజనేయులు, గాండ్ల లక్ష్మణ్ణ పాల్గొన్నారు.

### ఎన్టీఆర్ వైద్య మిత్ర ఎంప్లాయీస్ యూనియన్ ఏర్పాటు



ఎన్టీఆర్ వైద్య మిత్ర కాంట్రాక్టు అండ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జిల్లా కార్యవర్గం

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్యసేవ కాంట్రాక్టు అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని నగరంలోని కర్నూలు జీజీహెచ్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా సి. కంబగిరి, గౌరవ ముఖ్య సలహాదారులుగా డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీధర్, వైస్ ప్రెసిడెంట్‌గా లక్ష్మీప్రసన్న, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మహ్మద్ గౌస్, ప్రధాన కార్యదర్శిగా దేవేంద్ర నాయక్, జిల్లా సెక్రటరీగా జి.రాజశేఖర్ రెడ్డి, జాయింట్ సెక్రటరీగా రేణుక ఎన్నికయ్యారు.

## ప్రజా సమస్యలను పరిష్కరించండి

### అధికారులను ఆదేశించిన మంత్రి బీసీ



స్వీకరిస్తున్న రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ

బనగానపల్లె, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను ఆలస్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి టీడీపీ కార్యాలయంలో మంత్రి స్వయంగా అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలు అధికంగా వస్తున్నాయని రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి సమస్యలను పరిష్కరించాలన్నారు. అర్జీదారులను కార్యాలయాల చుట్టూ తిప్పవద్దన్నారు. ప్రజలను వేధించే అధికారులపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా ఆయా సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించి అక్కడికక్కడే పరిష్కరించారు.

## ఎన్నికల ప్రక్రియను ప్రక్షాళన చేయాలి

### మాజీ మంత్రి సాకే శైలజానాథ్



మాట్లాడుతున్న మాజీ మంత్రి సాకే శైలజానాథ్

కర్నూలు కల్చరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రక్రియను ప్రక్షాళన చేయాలని, బ్యాలెట్ పద్ధతిలో పోలింగ్ నిర్వహించాలని మాజీ మంత్రి, మాజీ పీసీసీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్డీయే ప్రభుత్వం బాధ్యతా రాహిత్యంగా పనిచేస్తోందని, ప్రజాస్వామ్యబద్ధంగా మాట్లాడిన వారిని కక్షసాధింపు చర్యలతో వేధిస్తోందని ఆరోపించారు. ఎన్డీయే ప్రభుత్వం చట్టానికి కట్టుబడి పనిచేయడం లేదని అన్నారు. సంభాల్‌లో రాహుల్ గాంధీకి అనుమతి నిరాకరించడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఈ మధ్యకాలంలో ఈవీఎంలపైన అనుమానాలు ఉన్నాయని చెబితే ఈ అంశాన్ని ఎలక్షన్ కమిషన్ దాటవేస్తోందని అన్నారు. హర్యాణాలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోనికి వస్తుందని అందరూ ఊహించారని, కానీ అక్కడి ఫలితాలు అనుమానాలకు తావిస్తున్నాయని చెప్పారు. మహారాష్ట్రంలో బీజేపీ అభ్యర్థులు గెలిచిన చోట ఐదు గంటల తర్వాత పోలింగ్‌లో 7, 8 శాతం ఓట్లు అదనంగా ఫామ్ 17సిలో రికార్డు అయ్యాయని అన్నారు. డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పరిగెల మురళీకృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని, ప్రజలకు తాగు, సాగునీటి కష్టాలు తీర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ మాజీ అధ్యక్షుడు కే బాబురావు, కాంగ్రెస్ నాయకులు కే వెంకటరెడ్డి, ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు బి. బతుకన్న, ఎస్ ప్రమీల, అనంతరత్నం, సయ్యద్ నవీద్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలం ఈవోగా ఎం.శ్రీనివాసరావు



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎం. శ్రీనివాసరావు

శ్రీశైలం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానం నూతన కార్యనిర్వహణాధికారిగా డిప్యూటీ కలెక్టర్ ఎం. శ్రీనివాసరావు గురువారం కార్యాలయ పరిపాలనా భవనంలో బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఈవో ఎం. శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వామి, అమ్మవార్ల దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా సేవలందించే అవకాశం రావడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం శ్రీశైలం క్షేత్రాన్ని తిరుమల తరహాలో అభివృద్ధి చేయాలనే కృతనిశ్చయంతో ఉందన్నారు. . దేవస్థానం సిబ్బంది సహాయ సహకారాలతో క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యంగా భక్తులకు వసతి, సౌకర్యవంతమైన దర్శనం, అన్నప్రసాద వితరణ తదితర వాటిపై ప్రత్యేక శ్రద్ధ చూపనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అన్నప్రసాదాల తయారీ, వంట పదార్థాలు, కూరగాయల నిల్వ, శుభ్రత తదితర వాటిపై అధికారులకు సూచనలు చేశారు.

### యురేనియం తవ్వకాలను ఆపాలి

#### సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



డోన్ రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):డోన్ నియోజకవర్గంలోని ప్యాపిలి మండలం మామిళ్లపల్లి, రాంపురం, జక్కసానిగుంట్ల గ్రామాల్లో యురేనియం తవ్వకాలు నిలిపివేస్తూ సీఎం చంద్రబాబు ప్రకటన చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం యురేనియం తవ్వకాలకు సిద్ధం కావడం దుర్మార్గమైన చర్య అన్నారు. గ్రామాలు, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని సీఎం చంద్రబాబు నాయుడు కేంద్రంతో మాట్లాడి యురేనియం తవ్వకాల ప్రయత్నాలను నిలిపివేయాలని కోరారు.

## జగన్ అసెంబ్లీకి ఎందుకు వెళ్లడం లేదు?

- ప్రజలు తిరస్కరించినా సిగ్గు రాలేదా..?
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



కర్నూలు అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై పోరాడటానికి వైసీపీ నాయకుడు జగన్ అసెంబ్లీకి ఎందుకు రావడం లేదని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి ప్రశ్నించారు. గురువారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించినా వైసీపీ నాయకులకు సిగ్గు రాలేదని అన్నారు. అసెంబ్లీకి వచ్చే ధైర్యం లేక కూటమి ప్రభుత్వంపై అవాకులు, చవాకులు పేలితే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. తొమ్మిదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచి విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంటు చెల్లించకుండా, రైతుల మోటర్లకు మీటర్లు బిగిస్తానంటూ నిలువునా కష్టాల్లోకి నెట్టిన వైఎస్ జగన్‌కు ఈ రోజు ప్రజా సమస్యలు గుర్తుకు వచ్చాయా? అని ప్రశ్నించారు. గతంలో ఫీజు రీయంబర్స్‌మెంటు చెల్లించక ఎందరో విద్యార్థులు ఉద్యోగాలు కోల్పోయారని అన్నారు. తమ హయాంలో రాష్ట్రాన్ని అప్పుల్లో నెట్టి దివాలా తీయిస్తే.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గాడిలో పెడుతున్నారని. దీన్ని చూసి ఓర్చుకోలేక ఆందోళనలకు దిగడం ఎంత వరకు సమంజసమన్నారు.

# ఎంత పని చేశావయ్యా...

- కుమార్తెను, భార్యను హతమార్చిన భర్త
- భార్య ఆరునెలల గర్భిణి
- మూడేళ్ల కుమార్తెను గొంతు నులిమి చంపిన తండ్రి
- పోలీసుల అదుపులో నిందితుడు
- హెబ్బటంలో దారుణం



మంచంపై విగతజీవులుగా తల్లి సమీర, కుమార్తె సలీమా

**ఆదోని/హొళగుంద, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):** జీవితాంతం తోడు ఉంటానని నిఖా చేసుకున్న ఆ భర్తే కాలయముడయ్యాడు. మంచి జీవితానికి, భవిష్యత్‌కు మార్గదర్శకుడు అవుతాడనుకున్న తండ్రే బిడ్డ గొంతు నులిమి చంపేశాడు. ఓ వైపు గర్భిణిగా ఉన్న భార్య, మరో వైపు ముక్కుపచ్చలారని కన్నబిడ్డను కనికరం లేకుండా హతమార్చిన సంఘటన కర్నూలు జిల్లా హొళగుంద మండలంలోని హెబ్బటం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఎమ్మిగనూరు మండలం బాపురం కబందహాల్ గ్రామానికి చెందిన పింజారి సక్రప్పతో హొళగుంద మండలం ఇంగళదహాల్ గ్రామానికి చెందిన మాబీ, మాబాష దంపతుల పెద్ద కుమార్తె సలీమా (21)ను ఇచ్చి వివాహం జరిపించారు. పెళ్లి సమయంలో రూ.50వేలు నగదుతో పాటు తులం బంగారు కట్నకానుకుల కింద ఇచ్చారు. రెండేళ్ల పాటు బాపురం కంబదహాల్ గ్రామంలో జీవనం సాగించిన వారు జీవనోపాధి కోసం హొళగుంద మండలంలోని హెబ్బటం గ్రామానికి వలస వచ్చి వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు. పెళ్లయిన ఏడాదిలోగా సలీమా పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. 40రోజుల వరకు ఉన్న ఆ శిశువు అనారోగ్య కారణాల వల్ల మృతి చెంది. మరి ఏడాదిలోనే మరో ఆడబిడ్డ సమీరా (3)కు జన్మనిచ్చింది. సలీమా ఆరు నెలల గర్భిణి. అయితే గత కొంత కాలంగా భార్యపై సక్రప్ప అనుమానం పెంచుకున్నాడు. దీంతో పాటు మళ్లీ ఆడబిడ్డకు జన్మనిస్తుందని, మగబిడ్డ పుట్టడేమో అంటూ భార్యతో నిత్యం గొడవ పడేవాడు. గురువారం కూడా భార్య సలీమాను అనుమానించి ఆడబిడ్డలకే జన్మిస్తున్నావని, నీకు





మగసంతానమే పుట్టదని హింసించాడు. ఈ క్రమంలో దంపతుల మధ్య వాదోపవాదాలతో పాటు తీవ్రస్థాయిలో ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో కోపోద్రిక్తుడైన సక్రప్ప భార్య సలీమాపై తల వెనక భాగంలో కర్రతో కొట్టాడు. ఒక్కసారిగా సలీమా కుప్పకూలింది. ఇదంతా గమనిస్తున్న కూతురు మూడేళ్ల చిన్నారి సమీరా భయంతో 'డాడీ..డాడీ..' అంటూ ఏడ్చింది. భార్యను చంపిన అనంతరం మూలన భయంతో దాక్కున్న కుమార్తె వద్దకు వెళ్లిన సక్రప్ప బాలికను లాక్కొచ్చి అత్యంత కర్కషంగా గొంతు నులిమి హతమార్చాడు. తల్లి కూతురు ఇద్దరు కూడా మృతి చెందాక పోలీసు ఎదుట లొంగిపోయాడు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఆలూరు సీఐ వెంకట చలపతి, ఎస్ఐ బాలనరసింహులు తెలిపారు.

### తల్లితో కలిసి అల్లుడే హత్య చేశాడు : మృతురాలి తల్లి

నా కూతురు, మనవరాలు సమీరను అల్లుడు, అతని తల్లి కలిసి చంపారని మృతురాలి తల్లి మాబీ ఆరోపించింది. ఒక్కరోజు క్రితం పుట్టినిల్లు నుండి హెబ్బటం గ్రామానికి ఆరు నెలల గర్భిణి అయిన కూతురిని, మనవరాలుని తీసుకొచ్చి దిగబెట్టానని ఇలా దూరం అవుతారని కలలో కూడా అనుకోలేదు అంటూ ఆమె రోదించిన తీరు కలచివేసింది. చిన్నారిని గొంతు నులిమి హత్య చేసేందుకు చేతులు ఎలా వచ్చాయంటూ విలపించింది. ఈ ఘటనను చూసిన ప్రతి ఒక్కరూ కన్నీటిపర్యంతమయ్యారు.

## యువకుడి బలవన్మరణం

- పెట్రోలుకు తల్లి డబ్బు ఇవ్వలేదని రైలు కిందపడి..

**ఆలూరు రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):** క్షణికావేశంలో రైలు కిందపడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆదోనిలో జరిగింది. ఆదోని పట్టణంలోని కిల్చిన్ పేటకు చెందిన రాఘవేంద్ర కుమారుడు సాకరే ఆకాష్ (20) గురువారం అర్ధరాత్రి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆకాష్ ఆలూరు పట్టణంలోని ఐటీఐ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. జల్సాలకు అలవాటు పడిన ఆకాష్ బుధవారం రాత్రి పెట్రోలకు రూ.500 ఇవ్వాలని తల్లిని అడిగాడు. అయితే తల్లి డబ్బు ఇవ్వలేదు. దీంతో క్షణికావేశానికి గురైన ఆకాష్ ఈరోజు రాత్రి నా డెడ్ బాడీ రైల్వే పట్టాలపై ఉంటుందని తల్లికి చెప్పి బయటకు వెళ్లిపోయాడు. ఆదోని-ఐస్వి రైల్వే స్టేషన్ల మధ్య కి.మీ 496/16-18డౌన్ లైన్ ట్రాక్ మధ్యలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే ఎస్ఐ గోపాల్ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి రాఘవేంద్ర ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపాల్ తెలిపారు.



సాకరే ఆకాష్ (ఫైల్)

## చెరువులో పడి బీహార్ వాసి..

**ఓర్వకల్లు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):** మండలంలోని గుమితం తండా సమీపంలోని కొమ్ముచెరువులో ప్రమాదవశాత్తు పడి బీహార్ రాష్ట్రం సివార్ జిల్లా బీరా బంకత్ గ్రామానికి చెందిన సోహైల్ అన్సారీ (20) గురువారం మృతి చెందినట్లు ఎస్ఐ సునీల్ కుమార్ తెలిపారు. యువకుడు పవర్ ప్రాజెక్టులో హెల్పర్‌గా పని చేస్తూ చేతికి అంటిన గ్రీస్ మరకలు శుభ్రపరిచేందు కోసం కొమ్ము చెరువులో చేతులు కడుగుతుండగా.. ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందాడు. మృతుని అన్న ఫిరోజ్ అన్సారీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



మృతి చెందిన సోహైల్ అన్సారీ

## చికిత్స పొందుతూ మహిళ..

**కోడుమూరు రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని లద్దగిరి మజరా గ్రామానికి రామాపురానికి చెందిన ఓ మహిళ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన చాకలి సుంకన్న భార్య హైమావతి (40) పట్ల అత్త సుంకులమ్మ, మరిది వెంకటరాముడు శారీరకంగా, మానసికంగా హింసించారు. మందు తాగి చనిపో అంటూ వేధించారు. ఈనేపథ్యంలో హైమావతి జీవితంపై విరక్తి చెంది గత నెల 24న పురుగుమందు తాగింది. దీంతో ఆమెను చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మహిళ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. హైమావతి తల్లి చాకలి చిన్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ఉరి వేసుకుని మహిళ..

**కొలిమిగుండ్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):** ఇంట్లో ఎవ్వరూలేని సమయంలో మహిళ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మ హత్య చేసుకున్న విషాదకర సంఘటన కొలిమిగుండ్ల మండలం అంకిరెడ్డిపల్లె గ్రామం లో గురువారం సాయంత్రం జరిగింది. గ్రామానికి చెందిన సుగాలి మంగే నాయక్ భార్య సుగాలి సోనీబాయి(45) అనారోగ్య కారణంగా ఈ అఘాయి త్యానికి పాల్పడినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. సీఐ రమేష్‌బాబు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.



మృతి చెందిన సోనీబాయి

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

**కొత్తపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని కృష్ణానది పరివాహక ప్రాంతమైన వీరభద్ర దుర్గం సమీపంలో ఓ గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు గురువారం సాయంత్రం కొత్తపల్లి ఎస్ఐ కేశవ తెలిపారు. వివరాలివీ.. మండలంలోని కృష్ణానదిలోని గరిగలదిన్నె వద్ద గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ముసలిమడుగు అటవీశాఖ సెక్షన్ అధికారి కావేరి ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతి చెందిన వ్యక్తి వయస్సు సుమారు 50 నుంచి 60ఏళ్లలోపు ఉండవచ్చని, క్రీం కలర్ ఫుల్‌షర్టు, బూడిదరంగు నిక్కర ధరించినట్లు ఎస్ఐ తెలిపారు. అలాగే చేతికి పూసల బ్యాండ్, నలుపురంగు దారం ఉన్నట్లు గుర్తించామన్నారు. చనిపోయిన వ్యక్తికి సంబంధించిన వివరాలు ఎవరికైనా తెలిసివుంటే కొత్తపల్లి ఎస్ఐ 9121101185కు సమాచారం అందించాలని తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

**డోన్ రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ ప్రవీణ్ కుమార్ (35) బుధవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. తెలంగాణ రాష్ట్రం జడ్చర్ల సమీపంలోని బాలానగర్‌లో లారీ అన్‌లోడు పాయింటు వద్ద టీ తాగేందుకు రోడ్డు సైడు వెళ్తుండగా.. జీపు ఢీకొని మృతి చెందాడని బంధువులు తెలిపారు. మృతదేహాన్ని గురువారం ఎర్రగుంట్ల గ్రామానికి తీసుకువచ్చారు. లారీ డ్రైవర్ భౌతిక కాయానికి డోన్ లారీ మోటర్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శివరాం పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబాన్ని ఓదార్చారు. మండలంలో లారీ డ్రైవర్లు, క్లీనర్లు, లారీ యజమానులతో సేకరించిన డబ్బులు రూ.36 వేల ఆర్థిక సాయాన్ని మృతుని కుటుంబానికి అందజేశారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.



ప్రవీణ్ కుమార్ (ఫైల్)

# 'అద్దె అడిగితే చంపేస్తామంటున్నారు..'

- న్యాయం జరగకపోతే ఆత్మహత్యే శరణ్యం
- పోలీసులు కూడా పట్టించుకోలేదు
- నంద్యాలలో ఓ కుటుంబం సెల్ఫీ వీడియో కలకలం



సెల్ఫీ వీడియోలో నాగరాజు కుటుంబ సభ్యులు

**నంద్యాల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):** 'షాపింగ్ కాంప్లెక్స్ అద్దె చెల్లించాలని అడిగితే రాఘవేంద్ర ప్రసాద్, అతడి కుమారులు వేధిస్తున్నారు. హత్య చేస్తామని బెదిరిస్తున్నారు. ఇక మాకు ఆత్మహత్యే శరణం..' అంటూ ఓ కుటుంబం తీసుకున్న వీడియో సెల్ఫీ గురువారం నంద్యాలలో కలకలం రేపింది. వివరాలు ఇలా ఉన్నాయి. నంద్యాల ఎన్‌జీవోస్ కాలనీకి చెందిన ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు తొమ్మంద్రు నాగరాజు వ్యాపారం చేసుకుంటూ జీవించేవాడు. ఎన్‌జీవోస్ కాలనీలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి నంద్యాలకు చెందిన రాఘవేంద్ర ప్రసాద్, అతడి ఇద్దరు కుమారులు కిరణ్‌కుమార్, అరుణ్‌కుమార్ అనే వ్యక్తులకు అద్దెకు ఇచ్చాడు. అయితే కొన్ని నెలలుగా అద్దె చెల్లించకుండా తనను వేధించేవారని బాధితుడు వాపోయాడు. చివరకు అద్దె అడిగితే చంపేస్తామంటూ బెదిరిస్తున్నారని, కుటుంబ సభ్యులను పరుషపదజాలంతో దూషిస్తూ అవమానిస్తున్నారని వెల్లడించారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో కలకలం రేపింది. చివరకు దుకాణాలవద్దకు వచ్చి అద్దె అడిగితే కుటుంబాన్నంతా చంపేస్తామంటూ బెదిరించడమే కాకుండా రూ.10లక్షలు ఇస్తే దుకాణాలను ఖాళీచేసి వెళ్తామంటున్నారని నాగరాజు సెల్ఫీ వీడియోలో పేర్కొన్నాడు. న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించినా పోలీసుల నుంచి స్పందన లేకుండా పోయిందని విలపించారు. తమకు న్యాయం జరగకపోతే కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని తన భార్య, కుమారుడితో కలిసి సెల్ఫీ వీడియోలో పేర్కొన్నాడు. సెల్ఫీ వీడియో అనంతరం నాగరాజు కుటుంబం అజ్ఞాతంలోకి వెళ్లడంతో ఉత్కంఠ నెలకొంది. ఇదిలా ఉండగా నాగరాజు కుటుంబాన్ని పోలీసులు రక్షించి న్యాయం చేయాలని ఆర్యవైశ్య సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

## 'ఉపాధ్యాయుడి మరణానికి కారకులను శిక్షించాలి'





కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

**కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):** రాయచోటి పట్టణంలోని కొత్తపల్లి ఉర్దూ పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న ఎస్.ఎజాస్ అహ్మద్‌పైన దాడి చేసి ఆయన మరణానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని ఫ్యాప్టో చైర్మన్ సెక్రటరీ జనరల్ ఎస్.గోకారి, జి.తిమ్మప్ప డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం నగరంలోని కలెక్టర్ ఎదుట గాంధీ విగ్రహం వద్ద ఫ్యాప్టో ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనం తరం ఎజాస్ అహ్మద్ మరణం పట్ల ప్రగాఢ సంతాపం తెలియ జేశారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారికి వినతి పత్రం అంద జేశారు. వారు మాట్లాడుతూ ఈ ఘటనతో ఉపాధ్యాయులు భయాందోళనకు గురవుతున్నారన్నారు. ఉపాధ్యాయుడి మృతి ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి బహిరంగంగా నిందితు లకు కఠిన శిక్ష విధించాలన్నారు. తరగతి గదిలో విద్యార్థులు క్రమశిక్షణ తప్పి, పాఠాలు బోధించే ఉపాధ్యాయునిపైనే దాడి చేసి మరణానికి కారణం కావడం అత్యంత దుర్మార్గమన్నారు. ఈ ధర్నాలో సభ్యులు మరియానందం నారాయణ, సేవాలాల్ నాయక్, నవీన్ పాటిల్, సురేష్ మూర్తి, ముర్తుజావలి, నిసార్, హేమంత్, ప్రసాద్, శివనాగిరెడ్డి, గోవింద్, శ్రీధర్ పాల్గొన్నారు.

## పాఠశాలను తనిఖీ చేసిన వైద్యాధికారి



ఆరోగ్య కార్డులు పంపిణీ చేస్తున్న డీఎంహెచ్‌వో

**బనగానపల్లె, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని కైప ఉన్నత పాఠశాలను జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ గురువారం తనిఖీ చేశారు. టంగుటూరు ప్రాథమిక ఆరోగ్యశాఖ పరిధిలోని కైప ఉన్నతపాఠశాలను సందర్శించి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసి ఆరోగ్య కార్డులు పంపిణీ చేశారు. విద్యార్థులందరికీ ఆర్‌బీఎస్‌కె కార్డులు విద్యార్థుల ఎత్తు, బరువు, హెచ్‌బీ టెస్టులు చేశారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఆర్‌బీఎస్‌కె కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టంగుటూరు వైద్యాధికారి డాక్టర్ శివశంకరుడు, పాఠశాల హెచ్‌ఎం భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు వైద్య సిబ్బంది వెంకటేశ్వర్లు, సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- రాష్ట్ర కార్యదర్శి జే. లలితమ్మ

**కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):** అంగన్‌వాడీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ అంగన్‌వాడీ కార్మికుల సంఘం రాష్ట్ర కార్యదర్శి జే. లలితమ్మ డిమాండ్ చేశారు. గురువారం ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ కార్మికులకు గౌరవ వేతనాలు పెంచాలన్నారు. అంగన్‌వాడీలకు సరుకులు ప్రతి నెల మూడో తేదీ లోపల చేర్చాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, చౌడేశ్వరి, సువర్ణ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

## పుట్టగొడుగుల ఫ్యాక్టరీలో ప్రమాదం

- ఒకరి పరిస్థితి విషమం
- మరో ముగ్గురు కార్మికులకు అస్వస్థత





చికిత్స పొందుతున్న భరుణ్ మాండల్, మరో కార్మికుడు

**ఓర్వకల్లు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని కాల్వ గ్రామ సమీపంలోని ఫ్రెష్ బౌల్ హార్టికల్చర్ ప్రైవేటు లిమిటెడ్ (పుట్టగొడుగుల ఫ్యాక్టరీ)లో గురువారం వర్మికంపోస్టు డ్రైనేజీ వాటర్ పైపులైన్‌కు అడ్డంగా ఉన్న గడ్డిని తొలగించేందుకు వెళ్లిన పశ్చిమబెంగాల్‌కు చెందిన కార్మికుడు భరుణ్ మండల్ ప్రమాదవ శాత్తు 10 అడుగుల మ్యాన్ హోల్‌లో పడిపో యాడు. హుశేనాపురం గ్రామానికి చెందిన కార్మికులు వేణుగోపాల్, హరీష్, వెంకటరమణ ఇది గమనించి. భరుణ్ మండల్‌ను బయటికి తీశారు. అయితే. పరిస్థితి విషమంగా ఉంది. మరో ముగ్గురు కార్మికులు వాసనతో అస్వస్థతకు గురయ్యారు. వీరిని కర్నూలు కామినేని ఆసుప త్రిలో చేర్పించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సునీల్ కుమార్ తెలిపారు.

## విజిబుల్ పోలీసింగ్‌లో 36 వాహనాలు సీజ్

**నంద్యాల క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):** రెండు రోజులుగా చేపట్టిన విజిబుల్ పోలీసింగ్‌లో 36 వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసు అధికారులు గురువారం తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేర నివారణే లక్ష్యంగా విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా చేపట్టిన డ్రంకెన్‌డ్రైవ్‌లో మొత్తం 37 కేసులు నమోదు చేసి 36 వాహనాలు సీజ్ చేశామన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో భాగంగా 116 ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఎంవీఐ యాక్ట్‌కింద 910 కేసులు నమోదు చేసి రూ.5,08,395ల జరిమానా విధించినట్లు వెల్లడించారు. డోన్ సబ్ డివిజన్ పరిధిలో జూదం ఆడుతున్న వారిపై దాడిచేసి అయిదుగురిని అరెస్ట్‌చేసి వారివద్ద నుంచి రూ.5720లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నాటుసారా స్థావరాలపై దాడులుచేసి 50లీటర్ల నాటుసారాతోపాటు 17 మద్యం అక్రమ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

## ఉద్యోగిని ఖాతాలో రూ.లక్ష మాయం

**ఎమ్మిగనూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని సచివాలయంలో ఏయన్‌ఎంగా పనిచేస్తున్న రాజేశ్వరి ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు రూ లక్ష కొట్టేశారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. రాజేశ్వరికి పట్టణంలోని ఎస్‌బీఐలో ఖాతా ఉంది. ఇందులో రూ 2.90 లక్షలు నిలువ ఉంది. మరో బ్యాంకులో కూడా ఖాతా ఉంది. అందులో గోల్డ్‌లోన్ ఉంది. రెండు రోజుల క్రితం గోల్డ్‌లోన్ చెల్లించేందుకు ఎస్‌బీఐ బ్యాంక్ ఖాతాలోని డబ్బును డ్రా చేసుకోనేందుకు వెళ్లింది. అయితే ఖాతాలో రూ 1.90 లక్షలు మాత్రమే ఉన్నాయి. సైబర్ నేరగాళ్లు అకౌంట్‌ను హ్యాక్ చేసి రూ.లక్ష కాజేసినట్లు గుర్తించి పట్టణ పోలీసులకు రాజేశ్వరి ఫిర్యాదు చేశారు.

## గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

**కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):** గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని జడ్పీ సీఈవో జి. నాసరరెడ్డి సూచించారు. రాష్ట్రీయ గ్రామ్ స్వరాజ్ అభియాన్ నిధులతో స్థానికీకరణ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు సంబంధించి రెండురోజుల శిక్షణ గురువారం డీపీఆర్‌సీ భవనంలో ప్రారంభమైంది. ప్రతి మండలం నుంచి ఈఓఆర్‌డీ/పంచాయతీ కార్యదర్శి, ఎంపీహెచ్‌ఓ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, పీఆర్ ఏఈ, ఏపీఎం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు హాజరయ్యారు. సీఈవో మాట్లాడుతూ సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన కోసం 9 థీమ్స్‌పై శిక్షణ ఉంటుందన్నారు. ఈ శిక్షణలో జిల్లా శిక్షణ పరిశీలకులు వెంకటరత్నం, శిక్షణ మేనేజర్ గిడ్డేష్, డీపీఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.


ఆంధ్రజ్యోతి — చిన్న ప్రకటన - పెద్ద స్పందన CLASSIFIEDS

**CHANGE OF NAME**

I, **DUDDEKUNTA HARIKA** (OLD NAME), R/O H NO: 6-11-A,Thimmampalli, Ananthapur Dist, A.P, have changed my name as **DUDDEKUNTA HARIKA REDDY** (NEW NAME) D/O. DUDDEKUNTA PARTHASARATHIREDDY

AJL-229315

**WANTED**

Required urgently for Travel Agency (1) Flight Ticketing Staff (2) Junior Accountant, **Contact**: 4th Floor, U-Con Plaza, Park Road, KURNOOL. **Cell: 73373 51381**

AJL-229312

**CHANGE OF NAME**

I, **HEMOZAIN ILIYAS KHAN** (OLD NAME), R/O H NO: 3-115-1,Hazarath ji Nagar, Kurnool Dist, A.P, have changed my name as **HEMOIZAIN ILIYAS KHAN** (NEW NAME) S/O. HEMOZAIN ABDULLA KHAN

AJL-229315

**బంగారం కొనబడును**

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర॥ **7382114647**

AJA- 198486

**CHANGE OF NAME**

I, **PULVALA PUNYAVATHAMMA** (Old Name) R/o.H.No:1-31, Kotla Street, Pagidyala (V&M), Nandyal dist, AP., have changed my Surname as **PULLYALA PUNYAVATHAMMA** (New Name) W/o.PULLYALA ESWARA REDDY

AJL-202585

**CHANGE OF NAME**

I, **PULLYALA ESWAR REDDY** (Old Name) R/o.H.No:1-31, kotla Street, Pagidyala (V&M), Nandyal dist, AP., have changed my Husband name as **PULLYALA ESWARA REDDY** (New Name) S/o. PULLYALA NARAYANA REDDY

AJL-229275

**పాఠకులకు ముఖ్య గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి





# అన్నదాతకు అపార నష్టం

- వర్షానికి నేలకొరిగిన పంటలు
- వరిధాన్యాన్ని కాపాడుకోవడానికి రైతుల అవస్థలు


గువ్వలకుంట్లలో వర్షానికి నేలవాలిన వరి

**బండిఆత్మకూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):** ఫెంగల్ తుఫాన్‌తో వరి రైతుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. గత రెండు రోజులుగా కురుస్తున్న చిరు జల్లుల కారణంగా రైతులు వరి ధాన్యాన్ని కాపాడుకోలేక కొందరు అయితే మరికొందరు కోతకోయని పంట నేల కూలుతుంటే ఆ పంటలను కాపాడుకోటంలో పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ప్రకృతి కన్నెర్రలో పేట్టిన పెట్టుబడులు దక్కించుకునేందుకు కర్షకులు రెండు రోజులుగా విలవిలలాడిపోతున్నారు

**కొత్తపల్లి:** ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో మండలంలో గురువారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. కొత్తపల్లి, గువ్వలకుంట్ల, బండినాయుని పాలెం, లింగాపురం, శివపురం, సింగరాజుపల్లి తదితర గ్రామాల్లో ఓ మోస్తరు వర్షానికి చేతికొచ్చిన పంటలు నేలవాలాయి. మరికొన్ని గ్రామాల్లో ఆరబెట్టిన వరిధాన్యం వర్షానికి తడిసిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటిని తొలగించేందుకు రైతులు అవస్థలు పడ్డారు. ఇదిలా ఉంటే తడిసి ధాన్యం కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదని రైతులు


ఎ.కోడూరులో వరి ధాన్యాన్ని ఆరబోస్తున్న రైతులు

ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే మద్దతు ధరతో కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

**గోస్పాడు:** తుఫాన్ వల్ల వరి రైతులు కుదేలయ్యారు. ఖరీఫ్‌లో వేసిన వరిపంటను ఇప్పటికే కొందరు రైతులు కోపించుకోగా వచ్చిన ధాన్యం వర్షానికి తడిసి నష్టపోయారు. పంటను కోయని రైతులు పంటమొత్తం నేల మట్టం కావడంతో కట్టలు కట్టించుకోవడానికి ఎక్కువ మొత్తంలో కూలీలకు డబ్బులు ఇచ్చి నష్ట పోతున్నారు.


పసురపాడులో పడిపోయిన వరిని కట్టలు కడుతున్న కూలీలు

## రోడ్డెక్కిన రైతన్నలు


సంతజూటూరులో ధర్నా చేస్తున్న రైతులు

**బండిఆత్మకూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):** వరి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతన్నలు రోడ్డెక్కారు. మండలంలోని సంతజూటూరు గ్రామ బస్టాండ్‌లో గురువారం రైతు సంఘం, సీపీఎంల ఆధ్వర్యంలో గంటకు పైగా రైతులు ధర్నా చేశారు. వాహన రాకపోకలు గంటకు పైగా ఆగిపోవటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సీపీఎం జిల్లా నాయకుడు రాజశేఖర్, మండల నాయకుడు రత్నం, డేవిడ్ మాట్లాడుతూ రైతులకు వరికి క్వింటాలుకు రూ.2100 గిట్టుబాటు ధర, కొనుగోలు కేంద్రాలు, రబీకి ప్రభుత్వం పంటల బీమా సొమ్ము చెల్లించాలని డిమాండ్ చేశారు. ధర్నా స్థలికి సిబ్బందితో చేరుకున్న ఎస్ఐ జగన్మోహన్ రైతులతో ఎట్టకేలకు ధర్నా విరమింపజేసి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ధర్నాలో సుధాకర్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.

## 'సాయి విజయుడు మృతి టీడీపీకి తీరని లోటు'


సంతాప సభలో పాల్గొన్న నాయకులు, కుటుంబ సభ్యులు

**పగిడ్యాల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):** నెహ్రూనగర్ గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు సాయి విజయుడు మృతి పార్టీకి తీరని లోటు అని టీడీపీ గ్రామ నాయకులు లోకానందరెడ్డి, హేమసుందర రాజు అన్నారు. గురువారం సాయివిజేయుడు స్వగృహంలో సంతాపసభ ఏర్పాటు చేశారు. నాయకులు మాట్లాడుతూ గ్రామంలో టీడీపీ బలోపేతానికి నిరతరం పాటుపడిన గొప్ప నాయకుడు అని కొనియాడారు. గ్రామంలో సొంత పొలంలో దాతల సహకారంతో సాయిబాబ ఆలయాన్ని నిర్మించారని అన్నారు. కుటుంబ సభ్యులు సాయిబాబు, వెంకటేశ్వర్లు, గ్రామస్థులు చాపల లక్ష్మన్న, వెంకటాద్రి తదితరులు ఉన్నారు.

## 'మెరుగైన వైద్యమే లక్ష్యం'


విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

**మిడుతూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):** విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యం అందించడమే రాష్ట్రీయ కిషోర్ స్వాస్థ్య కార్యక్రమం లక్ష్యమని వైద్యాధికారి వ్యామకేస్ అన్నారు. మిడుతూరు మాడల్ స్కూల్‌లో గురువారం రాష్ట్రీయ కిషోర్ స్వాస్థ్య కార్యక్రమం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్‌కేఎస్‌కే ప్రోగ్రామ్ అధికారి కాంతారావు నాయక్ హాజరై విద్యార్థులు ఆరోగ్య సూచనలు, సలహాలు ఇచ్చారు. సీహెచ్‌వో రంగస్వామి, సూపర్‌వైజర్లు ఏసేపు, రామతులశమ్మ, ఏఎన్ఎం జ్యోతి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ నేల దినోత్సవం


మల్యాలలో నేల దినోత్సవాన్ని నిర్వహిస్తున్న అధికారులు


వ్యవసాయ విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కళాశాల అసోసియేట్ డీన్ జయలక్ష్మి

**నంద్యాల రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):** నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో వ్యవసాయ పరిశోదన స్థాన సహాయ సంచాలకుడు జాన్సన్ అధ్యక్షతన గురువారం నేల దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ నేల పరిరక్షణకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఏడీఆర్ జాన్సన్ మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా నేలలలో లోపిస్తున్న పోషకాలను సమృద్ధిగా నింపేందుకు సేంద్రియ ఎరువులు వాడాలని సూచించారు. అనంతరం భూసార ఆరోగ్య సూత్రాలు, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలైన నంద్యాల వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. శాస్త్రవేత్తలు బాలాజీనాయక్, సతీష్‌కుమార్, జయలక్ష్మి, వ్యవసాయ అధికారులు, రైతులు పొల్గొన్నారు.

**మహానంది:** భావితరాల భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరు నేలను పరిరక్షించు కొనేందుకు కృషి చేయాలని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.జయలక్ష్మి సూచించారు. గురువారం ప్రపంచ నేల దినోత్సవాన్ని నిర్వహించారు. శాస్త్రవేత్తలు విద్యార్థులకు నేల గురించి అవగాహన కల్పించారు. అనంతరం వక్తృత్వ పోటీల్లో విజేతలైన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు జి.ఫరీదా, వి.శివజ్యోతి, పీవీ గీతా శిరీష, స్వరాజ్యలక్ష్మి, ఈఎస్‌వీ నారాయణరావు పాల్గొన్నారు.

**నందికొట్కూరు రూరల్:** మండలంలోని మల్యాల గ్రామంలో ప్రపంచ నేల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. నందికొట్కూరు ఏడీఏ విజయశేఖర్, ఏవో షేక్షావలి పాల్గొన్నారు.

**మిడుతూరు:** మండలంలోని చెరుకుచెర్ల గ్రామంలో ప్రపంచ నేల దినోత్సవాన్ని వ్యవసాయాధికారి పీరునాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నందికొట్కూరు వ్యవసాయ సహాయ సంచాలకుడు విజయశేఖర్ హాజరయ్యారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

**వెలుగోడు:** వెలుగోడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నేల దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు నేల, ఆరోగ్యంపై వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ ఆంజనేయ, ఏవో పవన్‌కుమార్, ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజరు నరంద్ర, యాగంటిపల్లి కేవీకే శాస్త్రవేత్త భార్గవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆ రహదారికి 'భూమా' పేరు పెట్టాలి

- నంద్యాల మాజీ ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి


మున్సిపల్ కమిషనర్‌తో చర్చిస్తున్న బ్రహ్మానందరెడ్డి

**నంద్యాల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):** నంద్యాలలోని పద్మావతినగర్-సాయిబాబానగర్ రహదారికి మాజీ ఎమ్మెల్యే దివంగత భూమా నాగిరెడ్డి పేరు పెట్టాలని మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం నంద్యాల మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ నిరంజన్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి కలిశారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నంద్యాలలోని పద్మావతినగర్ ఆర్చి నుంచి సాయిబాబానర్ ఆర్చి వరకు 80 అడుగులు రోడ్డు విస్తరణ చేసి వాహనదారులు, పాదచారు లకు సౌకర్యంగా ఏర్పాటు చేయించిన ఘనత అప్పటి ఎమ్మెల్యే భూమా నాగిరెడ్డికే దక్కిందన్నారు. ఆ రహదారికి ఆయన పేరు పెట్టాలని టీడీపీ ఇచ్చిన అనుమతులను, జీవోను అమలు చేయాలని మున్సిపల్ కమిషనర్ దృష్టికి భూమా బ్రహ్మానందరెడ్డి తీసుకువెళ్లారు. భూమా బ్రహ్మానందరెడ్డితోపాటు టీడీపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మాబువలి, టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర నాయకుడు మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాల ఆకస్మిక తనిఖీ


సరుకులను పరిశీలిస్తున్న డీఈవో జనార్దనరెడ్డి

**పాణ్యం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):** మండలంలోని బీసీ గురుకుల పాఠశాల, కళాశాలను డీఈవో జనార్దనరెడ్డి గురువారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పదో తరగతి విదార్థినులతో మాట్లాడారు. డార్మెటరీ, నూతన కంప్యూటర్ ల్యాబ్, డైనింగ్ హాల్, స్టోర్ రూంలను పరిశీలించారు. ఆహార సరుకుల నాణ్యతను పరిశీలించారు. శనివారం జరిగే మెగా పేరెంట్స్ సమావేశం గురించి ప్రిన్సిపాల్ ఫ్లోరమ్మతో చర్చించారు. విద్యార్థినులు తయారు చేసిన ఆహ్వాన పత్రికలను పరిశీలించి వారిని అభినందించారు. ఎంఈవోలు కోటయ్య, సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## దుర్గాభోగేశ్వరుడి హుండీ ఆదాయం లెక్కింపు


ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

**గడివేముల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని గడిగరేవుల గ్రామసమీపంలో వెలసిన దుర్గాభోగేశ్వర ఆలయంలో గురువారం సబ్ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి ఆధ్వర్యంలో దుర్గాభోగేశ్వరుడికి భక్తులు చెల్లించిన ముడుపులను లెక్కించారు. 9 నెలలకు సంబంధించి హుండీ లెక్కించగా రూ.1,834,371 ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వాహణాధికారి వీఎల్ఎన్ రామానుజన్ తెలిపారు. ఆలయ సిబ్బంది ఉన్నారు.

## ఘనంగా ఫ్రెషర్స్ డే


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కళాశాల డైరెక్టర్

**పాణ్యం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో గరువారం ఫ్రెషర్స్ డే ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈసీఈ హెచ్‌వోడీ సోఫియా ప్రియదర్శిని ఆధ్వర్యంలో విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ కళాశాలలో చేరిన విద్యార్థులకు సీనియర్లు మార్గ దర్శకులుగా ఉండాలని సూచించారు. క్రీడా విజేతలకు, డిపార్ట్‌మెంట్ టాపర్‌లకు బహుమతులు అందజేశారు. డాక్టర్ సతీష్, డాక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

## కురుకుంద వాసికి డాక్టరేట్


మహ్మద్ ఫైజుల్లా

**ఆత్మకూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):** మండలంలోని కురుకుంద గ్రామానికి చెందిన మహ్మద్ ఫైజుల్లాకు తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. ప్రస్తుతం ఆయన రాయచోటిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉర్దూ విభాగాధిపతిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే తిరుపతిలోని ఎస్వీయూ ఉర్దూ విభాగానికి చెందిన ప్రొఫెసర్ మహ్మద్ అమీనుల్లా సారథ్యంలో 'ఉర్దూ నవలల్లో నార్సిసిజం' అనే అంశంపై పరిశోధనలు చేసి సమర్పించారు. దీంతో ఎస్వీయూ డాక్టరేట్ ప్రదానం చేసింది.

## సారా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు

**నందికొట్కూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని షికారి పేటలో సారా తయారు చేసే కేంద్రాలపై ఎక్సైజ్‌శాఖ అధికారులు గురువారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. 600 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసి, 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ జఫ్రుల్లా, హెడ్ కానిస్టేబుళ్లు శంకర్ నాయక్, కుమారి, కానిస్టేబుళ్లు శివన్న, మధు ప్రసాద్, సుధీర్ పాల్గొన్నారు.

## సీసీ రోడ్ల పరిశీలన

**పాములపాడు డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):** పాములపాడులో నిర్మిస్తున్న సీసీ రోడ్లను ఎంపీడీవో చంద్రశేఖర్ పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టరును ఆదేశించారు. జూటూరు 1,2 సచివాలయాలను తనిఖీ చేశారు. ఎన్‌పీసీఐ, ఎంఎస్ఎంఈ, హౌసింగ్ జియో ట్యాగింగ్ సర్వేలను వేగవంతం చేయాలని సచివాలయ సిబ్బందికి సూచించారు

## 'కష్టపడ్డ వారికి గుర్తింపు'

**జూపాడుబంగ్లా, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):** పార్టీకోసం కష్టపడిన వారికి గుర్తింపు ఇస్తుందని టీడీపీ నాయకులు శివరామిరెడ్డి, మైనార్టీ నాయకులు అబ్దుల్ రవూఫ్ అన్నారు. జూపాడు బంగ్లా టీడీపీ మండల కన్వీనర్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు యాదవ్ యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితలు కావడంతో గురువారం పారు మంచాలలో ఆయనను పూల మాలలు, శాలువాలతో సత్కరించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని మిఠాయిలు పంపిణీ చేశారు.

## పీఎంఏవై గృహాల దరఖాస్తులకు ఆహ్వానం

**ఆత్మకూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):** ఆత్మకూరు మున్సిపాలిటీతో పాటు మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులు ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై 2.0) కింద గృహాల నిర్మాణాల కొరకు దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ ఏఈ ఉమామహేశ్వర రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. అర్హులైన లబ్ధిదారులు గ్రామ, వార్డు సచివాలయాల్లో బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకున్న అనంతరం డాక్యుమెంట్ జిరాక్స్ కాపీలను అందజేస్తే ప్రక్రియ ప్రారంభించను న్నట్లు తెలిపారు. పీఎంఏవై 2.0కి సంబంధించి రేషన్‌కార్డు, పాన్‌కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, జీవిత భాగస్వామిపేరు, జీవిత భాగస్వామి ఆధార్, ప్రస్తుత చిరు నామా, ప్రతిపాదిత సభ చిరునామా, బ్యాంకు వివరాలు, లబ్ధిదారుడి సంతకం/ వేలి ముద్రలు, మతం, కులం, ఉపకులం వివరా లతో నమోదు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా లబ్ధిదారుడి తల్లి, తండ్రి పేరు, ఆధార్ వివరాలు కూడా తెలియజేయాల్సి ఉంటుందని చెప్పారు. ఆదాయ, సంతకం, వేలిముద్రలు, ఆధార్ పత్రాలను స్కాన్ చేయాల్సి ఉంటుందని వివరించారు.

## 'వన్యప్రాణులను వేటాడడం నేరం'

**వెలుగోడు డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):** నల్లమల అటవీప్రాంతంలో వణ్యప్రాణులను వేటాడడం నేరమని అటవీశాఖ ఎఫ్ఎస్‌వో గోపి, ఎఫ్‌బీవో సూజాత అన్నారు. గురువారం వెలుగోడు అటవీశాఖ అధికారి కార్యలయంలో అడవి జంతువుల నుంచి పంట నష్టపోయిన ఆరుగురు రైతులకు రూ.53,200 నష్ట పరిహారం చెక్కులను అందించారు. ఈ సందర్భంగా అధికారులు రైతులకు పలు సూచనలు చేశారు.

## 'టీడీపీ సభ్యత్వంతో ప్రయోజనాలు'

**వెలుగోడు డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):** టీడీపీ సభ్యతంతో ప్రయోజనాలు ఉన్నాయని ఆ పార్టీ నాయకులు అన్నారు. వెలుగోడులోని 108వ బూత్‌లో పట్టణ అధ్యక్షుడు ఖలీల్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో నాగేంద్ర, ఆషీఫ్‌బాషా, ముర్తుజా, బుడ్డన్న, మధు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## 'ఉపాధ్యాయుడి మృతి బాధాకారం'

**నంద్యాల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):** అన్నమయ్య జిల్లాలో ప్రభుత్వ ఉపాధ్యాయుడి మృతి తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని ఆల్‌మైనార్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మహమ్మద్ అబులైస్ అన్నారు. గురువారం నంద్యాలలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అత్యున్నత విచారణ జరిపి ఘటనకు కారణమైనవారిని కఠినంగా శిక్షించాలని, మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆల్‌మేవా రాష్ట్ర జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బ్లాక్ స్పాట్ల వద్ద భద్రతా చర్యలు

**పాణ్యం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):** మండలంలోని జాతీయ రహదారిపై బ్లాక్‌స్పాట్‌ల వద్ద గురువారం జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా ఆదేశాల మేరకు పాణ్యం సీఐ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో భద్రతా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా తమ్మరాజుపల్లె వద్ద హైవే అథారిటీ సహకారంతో అత్యంత ప్రమాదకరంగా మారిన అడ్డవాగు వంతెనకు ప్రమాద సూచికలు, ప్రమాద సూచికల బోర్డులు ఏర్పాటు చేశారు. పాణ్యం పరిధిలో ఎక్కువ ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి రాత్రిపూట వంతెనలు కనపడేలా కల్వర్టుపై రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థిని అంత్యక్రియలకు ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న టీడీపీ నాయకులు

**నందికొట్కూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):** ప్రహరీ కూలి మృతి చెందిన విద్యార్థిని అస్తమహీన్ మట్టి ఖర్చులకు టీడీపీ నాయకులు రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేశారు. గురువారం నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే గిత్తా జయసూర్యల ఆదేశాల మేరకు ప్రమాదవశాత్తు ప్రహరీ కూలి మృతి చెందిన విద్యార్థిని మట్టి ఖర్చులకు రూ.20 వేలు ఆర్థిక సాయాన్ని టీడీపీ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో మాండ్ర ఉమాదేవి ఫోన్‌లో మాట్లాడి ప్రభుత్వ పరంగా సహాయ సహకారాలు అందే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. టీడీపీ పట్టణ క్లస్టర్ ఇచార్జి ముర్తుజావళి, ముస్లీం మైనార్టీ రాష్ట్ర అధికారప్రతినిధి షకీల్ అహ్మద్, ఇంతియాస్, కుమార్, ముత్తు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి



కంట్రిబ్యూటర్లు కావలెను

నంద్యాల జిల్లా కేంద్రంలో వార్తల సేకరణకు
రిపోర్టర్లు కావలెను. అభ్యర్థి కనీస విద్యార్హత డిగ్రీ. తెలుగు భాషలో
చక్కని పరిజ్ఞానం, సంఘటనలను వార్తలుగా మలచగలిగే నైపుణ్యం ఉండాలి.
అభ్యర్థులు నంద్యాల ప్రాంత వాసులై ఉండాలి.

❖ నంద్యాల టౌన్ ❖ నంద్యాల కలెక్టరేట్
❖ నంద్యాల హాస్పిటల్ ❖ నంద్యాల ఎడ్యుకేషన్
❖ నంద్యాల నూనెపల్లి

అర్హులైన అభ్యర్థులు 09-12-2024 (సోమవారం)
క్రింది అడ్రస్ నందు ఉదయం10 గంటలకు
జరిగే రాత పరీక్ష, ఇంటర్వ్యూకు హాజరు కావలెను.

చిరునామా :
ఆంధ్రజ్యోతి కార్యాలయం: గుత్తిరోడ్,
నియర్ మాంటిస్సోరి ఇండస్ స్కూల్, కర్నూలు.
సెల్ : 9985411361, 9985411362

# విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలి

- విద్యార్థి సంఘాల నిరసన

**నందికొట్కూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):** పాఠశాల అధికారులు విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉండడం వల్లే విద్యార్థిని అస్తమహీన్ మృతి చెందిందని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని సీపీఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం రాస్తారోకో, ఎంఈవో కార్యాలయం ముట్టడి కార్యక్రమాలు వేరువేరుగా చేపట్టారు. పట్టణంలోని పటేల్ సెంటర్‌లో రాస్తారోకో చేపట్టారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రఘురా మ్మూర్తి, ఏఐఎస్ఎఫ్ తాలుకా కార్యదర్శి దినేష్ మాట్లాడుతూ బుధవారం పట్టణంలోని విద్యానగర్‌లో ఉన్న ఉర్దూ పాఠశాలలో రెండో తరగతి విద్యార్థిని షేక్ అస్తమహీన్ పాఠశాల ప్రహరీ కూలీ ప్రాణాలు కోల్పోవడానికి కారణమైన వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు సాగర్, చిన్న శరత్, ఏఐటీయూసీ నాయకులు రాముడు, చిన్న, రామకృష్ణ, ముర్తుజావలి, చాంద్‌బాషా పాల్గొన్నారు.

**ఎంఈవో కార్యాలయం ముట్టడి:** విద్యార్థి మృతి న్యాయం చేయాలని పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పటేల్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించి, అనంతరం ఎంఈవో కార్యాలయాన్ని ముట్టడిం చారు. ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి హర్షవర్ధన్, పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా కార్యదర్శి ఆది మాట్లాడుతూ ప్రహరీ కూలి విద్యార్థిని చనిపోతే డీఈవో స్పందించక పోవడం బాధాకరమ న్నారు. బాధిత కుటుంబానికి రూ.30 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యార్థి నాయకులు మహబూబ్, గణేష్, జగదీష్, శ్యాంనాయక్ పాల్గొన్నారు.




నందికొట్కూరు ఎంఈవో కార్యాలయాన్ని ముట్టడించిన ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ నాయకులు, పట్టణంలోని పటేల్ సెంటర్‌లో రాస్తారోకో చేస్తున్న ఏఐఎస్ఎఫ్, ఏఐటీయూసీ నాయకులు

**వైసీపీ నాయకుల పరామర్శ:** విద్యార్థిని షేక్ అస్తమహీన్ కుటుంబ సభ్యులను వైసీపీ నందికొట్కూరు నియోజకవర్గ సమన్వయకర్త దారా సుధీర్ పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వైఫల్యం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో వైసీపీ టౌన్ అధ్యక్షుడు మన్సూర్ అహ్మద్, కౌన్సిలర్లు నాయబ్, సర్పంచ్‌లు జనార్దన్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

## ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేయాలి



మాట్లాడుతున్న జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు

**శిరివెళ్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) :** అకాల వర్షాలతో తడిసిన, రంగు మారిన వరి ధాన్యాన్ని ప్రభుత్వమే కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు, జిల్లా కమిటీ సభ్యుడు రాజు నాయక్ డిమాండ్ చేశారు. మండలంలోని మహదేవపురం గ్రామంలో గురువారం వారు మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో రైతులు ఖరీఫ్‌లో 1.7 లక్షల ఎకరాల్లో వరి పైరును సాగు చేశారన్నారు. తుపాను ప్రభావంతో తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. తేమ శాతం, తూకం పేరుతో దళారులు చేస్తున్న మోసాల నుంచి నుంచి రైతులను కాపాడాలన్నారు. ప్రభుత్వం రైతులకు రాయితీపై టార్పాలిన్లను పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో తెలుగు నరసింహులు, కిట్టన్న పాల్గొన్నారు.

## బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో ఎక్సైజ్ సిబ్బంది

**ఆళ్లగడ్డ (శిరివెళ్ల), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):** గ్రామాల్లో మద్యం బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఆళ్లగడ్డ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ సీఐ విజయ్‌కుమార్ హెచ్చరించారు. ఆళ్లగడ్డ ఎక్సైజ్, నంద్యాల జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు పలు మండలాల్లో గురువారం దాడులు నిర్వహించారు. రుద్రవరం మండలం ఆలమూరులో, గోస్పాడు మండలం ఎం.కృష్ణాపురంలో, ఆళ్లగడ్డ మండలం మిట్టపల్లె గ్రామాల్లో నిర్వహిస్తున్న బెల్ట్‌షాపులపై దాడులు నిర్వహించి ముగ్గురిని అరెస్టు చేశారు. వారి నుంచి 71 మద్యం సీసాలు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌దాస్, ఎక్సైజ్ ఎస్‌ఐలు సరస్వతి, శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు ఆళ్లగడ్డలో జాబ్ మేళా

**ఆళ్లగడ్డ(శిరివెళ్ల), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) :** ఆళ్లగడ్డ పట్టణంలోని అనంత డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ అనంత రామసుబ్బారెడ్డి గురువారం తెలిపారు. నిరుద్యోగులు ఈ అవ కాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అభ్యర్థులు తమ ఎడ్యుకేషన్ సర్టిఫికెట్స్, ఆధార్‌కార్డు జిరాక్సులతో పాటు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు తీసుకురావాలన్నారు. పూర్తి వివరాల కోసం 9701303790, 8790895790 నంబర్లను సంప్రదించాలన్నారు.


## సూర్య ఘర్ పథకంతో విద్యుత్ బిల్లులు ఆదా



శిరివెళ్లలో మాట్లాడుతున్న ఏడీఈ రవికాంత్ చౌదరి

**శిరివెళ్ల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) :** పీఎం సూర్య ఘర్ పథకంతో వినియోగదారులకు విద్యుత్ బిల్లులు ఆదా అవుతాయని ఏడీఈ రవికాంత్ చౌదరి అన్నారు. శిరివెళ్లలోని విద్యుత్ ఉప కేంద్రంలో ప్రజలు, విద్యుత్ సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. ఇంటి పైకప్పుపై సౌర పలకలను ఏర్పాటు చేసుకుని విద్యుత్ బిల్లులను గణనీయంగా ఆదా చేసుకోవచ్చని సూచించారు. కిలో వాట్ సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్ టాప్‌కు రూ.30 వేలు, రెండు కిలోవాట్లకు రూ.60 వేలు, మూడు కిలోవాట్లకు రూ.78 వేలు చొప్పున కేంద్ర ప్రభుత్వం రాయితీ ఇస్తుందని ఏడీఈ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శిరివెళ్ల ఇన్‌చార్జి ఏఈ మల్లికార్జున, సిబ్బంది పాల్గొన్నారు.

## శింగనపల్లెవాసికి డాక్టరేట్



**అవుకు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) :** అవుకు మండలం శింగనపల్లె కు చెందిన మనుబోలు వేణుగోపాల్‌నాయుడు డాక్టరేట్ పట్టాను పొందాడు. సాలీడ్ అగ్రికల్చర్ వేస్టు టు ప్రిపేర్ న్యాచురల్ కాంపోజిట్ లో పరిశోధన చేశాడు. ప్రస్తుతం నంద్యాల సమీపంలోని ఆర్‌జీఎం ఇం జనీరింగ్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు.

## పందుల బెడదను అరికట్టండి



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న రైతులు

**కొలిమిగుండ్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):** కొలిమిగుండ్లలో పందుల బెడదను నిర్మూలించాని గ్రామానికి చెందిన రైతులు అధికారులకు వినతి పత్రం సమర్పించారు. పందులు రైతుల పంటలపై దాడులు చేస్తూ పంటలకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని ఎంపీడీవో ప్రసాదరెడ్డితోపాటు, సీఐ రమేష్‌బాబుకు, పంచాయతీ కార్యదర్శికి రైతులు వినతి పత్రాలు అందించారు. కార్యక్రమంలో రైతులు గూడురు మహేశ్వరరెడ్డి, రామచంద్రారెడ్డి, చిన్న పెద్దయ్య, శరత్ పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే ధ్యేయం

**బనగానపల్లె, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):** పేదల సంక్షేమం కోసం వసుధా ఫౌండేషన్ నిరంతరం పని చేస్తోందని టీడీపీ నంద్యాల పార్లమెంట్ వాణిజ్య విభాగం అధ్యక్షుడు, వసుధా ఫౌండేషన్ బనగానపల్లె నియోజకవర్గం కన్వీనర్ టంగుటూరు శ్రీనయ్య అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ బనగానప ల్లె నియోజకవర్గంలో హైదరాబాద్‌కు చెందిన వసుధా ఫౌండేష న్ అధ్యక్షుడు మంతెన వెంకటరామరాజు ఎన్నో సేవలందిస్తున్న ట్లు తెలిపారు. ఆర్థిక సాయానికి సహకరించిన ఫౌండేషన్ కార్య దర్శి పెండేకంటి రమణకుమార్‌ను అభినందించారు. కార్యక్రమం లో తిరుమలయ్య, హర్ష, టీచర్ నాగరాజు పాల్గొన్నారు.

## చర్యలు తీసుకోవాలి

**చాగలమర్రి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):** రాయచోటి ఉపాధ్యాయుడు ఇజాజ్‌అహ్మద్ మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఫ్యాప్టో నాయకులు మస్తాన్‌బాషా, సుబ్బారావు, మౌలాలి, ఆంజనేయరెడ్డి అన్నారు. గురువారం చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాలలో ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్లకు వినతి పత్రం అందజేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ఇజాజ్ అహ్మద్ మృతి పట్ల సంతాపం ప్రకటించి సానుభూతి వ్యక్తం చేశారు.



శనగలో నిలిచిన నీరు చూపుతున్న నాగిశెట్టిపల్లె రైతు రంగస్వామి



మాయలూరులో నేలవాలిన వరి పంట



చాగలమర్రి: స్కూల్ ఆవరణలో నిలిచిన వర్షం నీరు

# వదలని వాన

## పంట నష్టంతో నిండా మునిగిన రైతన్న

### పత్తి రైతు చిత్తు

**దొర్నిపాడు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):** ఫెంగల్ తుఫాన్‌తో వరి, పత్తి పంటలు దెబ్బతిన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. చేతికొచ్చిన వరి పంట కళ్లముందే చేజారిపోయిందని, కోత దశలో ఉన్న పంట పూర్తిగా నేలవాలి గింజలు రాలిపోతున్నాయని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. అలాగే సీడు పత్తి పంటలో వర్షపు నీరు నిలిచి పత్తి కాయలు రాలి కుళ్లిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



దొర్నిపాడులో వర్షానికి నేలవాలిన వరి పంట

### దెబ్బతిన్న మినుము, వేరుశనగ

**చాగలమర్రి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):** చాగలమర్రి మండలంలో గురువారం 30 మీ.మీ వర్షపాతం నమోదైంది. మల్లేవేముల గ్రామంలో శనగ, మినుము పంటలు నీట మునిగాయి. చింతలచెరువు, కొలుములపేట, మూడురాళ్లపల్లె గ్రామాల్లో 500 ఎకరాల్లో వేసిన కేపీ ఉల్లి పంట కుళ్లిపోయింది. దీంతో అన్నదాతలు కన్నీటి పర్యంతమవుతున్నారు. ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నారు. కుండపోత వర్షంతో పలు రహదారులు, ప్రభుత్వ కార్యాలయాలు, దేవాలయాలు, పాఠశాల ప్రాంగణాలు నీటి కుంటలను తలపించాయి. మురికి కాలువలు వర్షపు నీటితో కలిసి రహదారులపై పొంగి ప్రవహించాయి. రాజోలి ఆనకట్ట వద్ద 4 వేల క్యూసెక్కులతో కుందూ ప్రవహిస్తోందని కేసీ కెనాల్ డీఈ పుల్లయ్య తెలిపారు.



ఉయ్యాలవాడలో కురుస్తున్న వాన

### చేజారిపోతున్న వరి పంట

**ఉయ్యాలవాడ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):** మండలంలోని గ్రామాల్లో గురువారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు భారీ వర్షం కురిసింది. దీంతో మండలంలో 18.8 మిల్లీ మీటర్ల వర్ష పాతం నమోదైంది. ఈ వర్షపాతం వరి పంటపై తీవ్ర ప్రభావం చూపుతోంది. కోత దశలో ఉన్న వరి పంట పూర్తిగా నేలవాలి గింజలు రాలిపోతున్నాయి. ధాన్యాన్ని ఆరబెట్టిన రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. వర్షం కొంత ఎడతెరిపి ఇవ్వగానే ధాన్యాన్ని రైతులు ఆరబెట్టే ప్రయత్నం చేస్తుండగా మళ్లీ వర్షం కురుస్తోంది. దీంతో రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ధాన్యానికి మూడు రోజుల పాటు పట్టలు కప్పి ఉంచటం వల్ల ధాన్యం మొలకలు వచ్చే ప్రమాదం ఉంది. ధాన్యం కొనేందుకు కూడా వ్యాపారులు ముందుకు రావటం లేదు. మండలంలో దాదాపుగా 500 హెక్టార్లలో వరి పంట, వేలాది క్వింటాల ధాన్యం దెబ్బతిన్నట్లు రైతులు వాపోతున్నారు.

### ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలి



దెబ్బతిన్న, తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలి. తుఫాన్ ప్రభావంతో చాలా నష్ట పోయాం. దాదాపుగా 50 బస్తాల వరి ధాన్యం తడిచిపోయింది. ధాన్యం కొనేందుకు వ్యాపారులు ముందుకు రావటం లేదు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నా.

**- నరసింహుడు, రైతు, రూపనగుడి గ్రామం**

## వరి రైతుకు వానపోటు

**కొలిమిగుండ్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి)** మండలంలోని పలు గ్రామాల్లో భారీ నుంచి ఓమోస్తరు వర్షం కురిసింది. దీంతో అన్నదాతలకు భారీ నష్టం జరిగింది. పలు గ్రామాల్లోని పంట పొలాల్లో నీరు నిలిచింది. ప్రధానంగా వరి పంట పూర్తిగా నేలకొ రిగింది. దీంతో లక్షలాది రూపాయలు నష్టం వాటిల్లినట్లు అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని నాగిశెట్టిపల్లె, తిమ్మనాయినిపేట, ఎర్రగుడి, అబ్దులాపురం, కోరుమానుపల్లె, కొలిమిగుండ్ల తదితర గ్రామాల్లో సుమారు రెండు వందల ఎకరాల్లో కోత దశలో ఉన్న వరి పంట నేలకొరిగింది. మరోవైపు నాలుగు రోజులుగా నెలకొన్న వాతావరణం, కురిసిన వర్షం కారణంగా కంది పంట భారీగా దెబ్బతిన్నట్లు రైతులు వాపోతున్నారు.



చాగలమర్రిలో వర్షానికి దెబ్బతిన్న ఉల్లి



కొలిమిగుండ్ల: పంట పొలంలో నిలిచిన వర్షపు నీరు

**రుద్రవరం :** ఎడతెరిపి లేని వానతో ధాన్యం కుప్పల్లో ధాన్యం మొలకెత్తింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి ఆదుకోవాలని రైతులు కోరారు. రుద్రవరం మండలంలో 6337 హెక్టార్లలో ఖరీఫ్ సీజనులో రైతులు వరి పంట సాగు చేశారు. 4472 హెక్టార్లలో ఇప్పటికే కోత కోశారు. మిగిలిన 1865 హెక్టార్లు నేలపాలైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ఆట పాటల ద్వారా విద్యా బోధన



చిన్నారుల తల్లిదండ్రులకు సూచనలిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

**దొర్నిపాడు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆట పాటలతో విద్యాబోధన చేస్తామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ అన్నారు. గురువారం మండలంలోని ఉమాపతి నగర్ గ్రామంలో ఈసీసీఈడే సందర్భంగా ఆరేళ్లలోపు చిన్నారు లకు అంగన్‌వాడీ కేంద్రంలోని మెటీరియల్ ద్వారా చిన్నారులకు, తల్లులకు అవగాహన కల్పించారు. మూడేళ్ల నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పాలని తల్లిదండ్రులను కోరారు.

## అంగన్‌వాడీ ప్రీ స్కూల్స్‌పై అవగాహన



మాట్లాడుతున్న అంగన్‌వాడీ వర్కర్ పద్మావతి

**చాగలమర్రి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):** చాగలమర్రిలోని 4, 16 అంగన్ వాడీ కేంద్రాల్లో ప్రీస్కూళ్లపై తల్లులకు గురువారం అంగన్‌వాడీ వర్కర్లు పద్మా వతి, సంజీవమ్మ అవగాహన కల్పించారు. ఈసీసీఈ డే సందర్భంగా మహిళల కు అంగన్‌వాడీ సేవల గురించి తెలియజేశారు. పిల్లలకు ఆట పాటల ద్వార విద్యాబోధన, పౌష్టికాహారం అందించామని అన్నారు. చిన్నారులకు 5వ తరగతి వరకు ప్రీస్కూల్స్‌లో విద్యాబోధన కొనసాగిస్తామని తెలిపారు. తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించేలా చూడాలని తల్లిదండ్రులను కోరారు.

## బాలల సంరక్షణ విద్యపై అవగాహన

**రుద్రవరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) :** అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలల సంరక్షణ విద్య పట్ల అవగాహన కల్పిస్తున్నట్లు అంగన్‌వాడీ కార్యకర్తలు మనోజ, పద్మావతి, రాజ్యలక్ష్మిలు అన్నారు. గురువారం యల్లావత్తుల, చిన్నకంబలూరు, డి.కొట్టాల గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలల సంరక్షణ విద్య పట్ల తల్లులకు అవగాహన కల్పించారు. అంగన్వాడీ కేంద్రాల్లోనే ఆటపాటల గురించి, మాట, సృజనాత్మకత, శాస్త్రీయ పరిజ్ఞానం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి



మాట్లాడుతున్న ఏడీఏ అశోక్‌వర్ధన్ రెడ్డి

**ప్యాపిలి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):** పంటలకు రసాయన ఎరువులు తగ్గించాలని డోన్ ఏడీఏ అశోక్‌వర్ధన్‌రెడ్డి అన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో గురువారం ప్రపంచ నేల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ రసాయన ఎరువులు విరివిగా వాడడం వల్ల భూసారం తగ్గుతుందన్నారు. జీవ వైవిధ్యానికి సంబంధించిన ఆవు పేడ, ఆవు మూత్రంతో తయారు చేసిన ఎరువులను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో రాజేష్, వ్యవసాయ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, రైతులు పాల్గొన్నారు.

## భూమితోనే మానవ మనుగడ



ఆదర్శ పాఠశాలలో భూమిపై అవగాహన కల్పిస్తున్న ఏవో

**రుద్రవరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) :** భూమితోనే మానవ మనుగడ సాధ్యమని ఏవో నాగేంద్రప్రసాద్ అన్నారు. గురువారం రుద్రవరం ఆదర్శ పాఠశాలలో ప్రపంచ నేల దినోత్సవం నిర్వహించారు. ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు హరిత విప్లవంలో భాగంగా అధిక దిగుబడులు సాధించే విత్తనాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎక్కువ మోతాదులో రసాయన ఎరువులు వాడడం వల్ల నేల సారవంతం తగ్గిపోతుందని అన్నారు. పశువుల ఎరువు, పచ్చిరొట్టతో నేల ఆరోగ్యంగా ఉంటుందన్నారు.

## విద్యుత్ ఒప్పందాలు రద్దు చేయాలి

**కొలిమిగుండ్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) :** అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అదానీతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి దావీదు డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఒప్పందాలపై వైసీపీని విమర్శిస్తున్న ప్రభుత్వం వాటిని ఎలా కొనసాగిస్తుందని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఆ ఒప్పందాలను రద్దు చేయాలని అన్నారు. అదానీ ఒప్పందాలను రద్దు చేసి తన నిజాయితీని నిరూపించుకోవాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు.

## దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో మెలగాలి

న్యాయాధికారి తంగమణి




మాట్లాడుతున్న న్యాయాధికారి తంగమణి

**ప్యాపిలి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):** దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో మెలగాలని డోన్ సీనియర్ సివిల్ న్యాయాధికారి తంగమణి అన్నారు. స్థానిక సెక్రెడ్ సంస్థ కార్యాలయంలో గురువారం అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు విద్యా, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించిందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా ఎదగాలని ఆమె దివ్యాంగులకు సూచించారు. అంతకు ముందుగా పట్టణంలో దివ్యాంగులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ మధుసూదన్, సెక్రెడ్ డైరెక్టర్ తిప్పన్న, కోఆర్డినేటర్ శివశంకర్, ఎల్లప్ప, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణి మృతిపై విచారణ జరిపించాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు ఎల్లయ్య

**బేతంచెర్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):** పట్టణంలో దుర్గాపేట కాలనీలో నిండు గర్భిణి మృతిపై విచారణ జరిపించాలని సీపీఎం సీనియర్ నాయకులు ఎల్లయ్య, సీపీఎం పట్టణ కార్యదర్శి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ సాగరిక నిర్లక్ష్యం వల్లే సైదుమణి అనే గర్భిణి మృతి చెందిందని అన్నారు. నిర్లక్ష్యం వహించిన డాక్టరుపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మద్దిలేటి, రామాంజనేయులు, సంజీవరాయుడు, రాజబాబు, వేణుగోపాల్ పాల్గొన్నారు.

## ఎంఎస్ఎంఈ సర్వేకు సహకరించండి



మాట్లాడుతున్న నగర కమిషనర్ హరిప్రసాద్

**బేతంచెర్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):** ప్రభుత్వం నిర్వహించే ఎంఎస్ఎంఈ సర్వేకు సహకరించాలని నగర పాలక కమిషనర్ హరిప్రసాద్ కోరారు. గురువారం నగర పంచాయితీ కార్యాలయంలో ఫ్యాక్టరీలు, వ్యాపార దుకాణాల యజమానులకు ఎంఎస్ఎంఈ సర్వేపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం పథకాలను వర్తింపజేయడానికి సర్వే నిర్వహిస్తోందని, ఫ్యాక్టరీలు, వ్యాపార దుకాణల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

## వైభవంగా కలశ స్థాపన మహోత్సవం



పాత శివాలయంలో పూజలు చేస్తున్న మహిళలు

**చాగలమర్రి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):** చాగలమర్రిలోని పాత శివాలయంలో నాగదేవత విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా వేద పండితుల ఆధ్వర్యంలో గురువారం కలశ స్థాపన, అగ్నిప్రతిష్ఠ, జలాధివాసం, పారాయణ కార్యక్రమాలు వేద పండితుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. 7వ తేదీ నాగదేవత విగ్రహ ప్రతిష్ఠ, భక్తులకు అన్నదానం ఉంటుందని ఆలయ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

## 9 నుంచి డెయిరీ ఎన్నికలు

**చాగలమర్రి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని డి.వనిపెంట, ముత్యాలపాడు, చక్రవర్తులపల్లె, నగల్లపాడు గ్రామాల్లో డెయిరీ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి చంద్ర తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ 9న నగల్లపాడులో నామినేషన్ ఉంటుందని, 12న ముత్యాలపాడు, 16న చక్రవర్తులపల్లె, 19న డివనిపెంట గ్రామాల్లో నామినేషన్లు స్వీకరిస్తామని అన్నారు. పాల ఉత్పత్తిదారుల సభ్యులు డైరెక్టర్లు, ఛైర్మన్‌ను ఎన్నుకుంటారని తెలిపారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

**బనగానపల్లె, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):** బనగానపల్లె పట్టణంలోని ఎంపీపీ కస్బా పాఠశాల నందు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న సత్యప్రకాశ్, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన ప్రతాప్‌ను గురువారం విష్ణు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పుల్లారెడ్డి సత్కరించారు. పుల్లారెడ్డి మాట్లాడుతూ పేద విద్యార్థుల భవిష్యత్‌ను ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని కోరారు. ఇద్దరు ఉపాధ్యాయులు అవార్డులు సాధించడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం సుంకన్న, ఉపాధ్యాయులు కృష్ణయ్య, అబ్దుల్ కలీం, పుష్పలత, లక్ష్మీదేవి, సత్యనారాయణరెడ్డి, రాయలసీమ సలాం, నాగేశ్వర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## సబ్సిడీపై రైతులకు మల్చింగ్ షీట్లు

**కొలిమిగుండ్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):** రైతులకు ఉద్యానవన శాఖ సబ్సిడీ కింద మల్చింగ్ షీట్లు అందజేస్తోందని కోవెలకుంట్ల డివిజన్ హార్టికల్చర్ అధికారి ధరణి గురువారం అన్నారు. ఈ మేరకు రైతులు మల్చింగ్ షీట్లు ఏర్పాటు చేసుకున్న పంటలను ఆమె పరిశీలించారు. డివిజన్‌లోని పలు గ్రామాల్లో రైతులు కలింగర, కర్బూజ, కొన్ని రకాల కూరగాయల సాగుకు మల్చింగ్ షీట్లు వాడతారని తెలిపారు. మల్చింగ్ షీటుకు ఉద్యానవన శాఖ హెక్టారుకు రూ.16వేలు సబ్సిడీ అందిస్తోందని చెప్పారు.

## సాయిబాబాకు విశేష పూజలు

**చాగలమర్రి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):** చాగలమర్రిని సాయినాథ మందిరంలో గురువారం సాయిబాబా పల్లకి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. మార్గశిరమాసం సందర్భంగా మహిళలు పూజలు, అభిషేకాలు చేశారు.



సాయిబాబాకు పూజలు చేస్తున్న భక్తులు